
అఖిల

అఖిల భారత పత్రిక

ఆగస్టు 2012



Rs. 15

9/8/2012.


విషయసూచిక

నిజమైన హిందూత్వమంటే

(భారతీయ సంస్కృతి: మతం)

భారతీయ మతం

జాతి కొక పిలుపు



విభజన (పాకిస్తాను, భారతం) తర్వాత ఈ పటం తయారుచేయబడింది. కాలంతో పాటు కదలిపోయే ఆకారాలెలా వున్నప్పటికీ ఇది యథార్థమైన భారతదేశ పటం. దీన్ని గురించి ప్రజలెలా భావించినప్పటికీ అది యథార్థమైన భారతదేశ పటంగా శాశ్వతంగా నిలిచిపోతుంది.

శ్రీమాత

భారతదేశ ఆధ్యాత్మిక సంస్కృతి
జీవితానికి ఆధ్యాత్మికానువర్తనం

మొదట మనం ఆ ఆదర్శం అంటే ఏది కాదని అర్థం చేసుకున్నామో దాని గురించి చెప్పుకుందాం. స్పష్టంగా అది ఈ భూజీవితం ఐహిక మాయాకల్పిత జీవితమనే అర్థాన్నివ్వదు. అందరమూ ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా కఠోర నియమాలతో, మఠాలలో నివసించే సన్యాసులమై పోవడమనే అర్థాన్నీ ఇవ్వదు. మఠాలలో లేదా కొండగుహలలో లేదా గిరిశిఖరాల మీదా నివసించ సన్నద్ధం చేసే సాంఘిక జీవన చట్రమూ కాదు. లేదా పురోభివృద్ధికి సంబంధించిన ఎటువంటి గొప్ప ఆదర్శాలు లేని ఎదుగూ బొదుగూ లేని జీవితమూ కాదు. కాని అది భూమికీ లేదా మానవజాతి సాముదాయక పురోభివృద్ధికీ ఏమాత్రం సంబంధం లేని ఏదో ఒక లక్ష్యాన్ని మాత్రమే సూచిస్తుంది. అది కొంత కాలం భారతజాతి మానసిక పోకడై ఉండి ఉండవచ్చును. కాని అదే పూర్తిగా దాని అభిమతం కాదు. అంతే కాకుండా ఆధ్యాత్మికత అంటే మొత్తం జాతి అస్తిత్వాన్నంతటినీ కొన్ని పరిమిత మతసిద్ధాంతాలకూ, రూపాలకూ, మూఢాచారాలకూ తగినట్లు తయారుచేయటం కాదు. ఒక వ్యక్తి బోధనల ననుసరించే ఒక ప్రత్యేక మూసలో తీర్చిదిద్దాలని అనుకోవటమూ కాదు. ఆ పద్ధతిలోనే ప్రాచీన సమాజాలు తమ శాయశక్తులా తరచూ ప్రయత్నిస్తూ వచ్చాయి. అదే భావన పురాతన మానసిక అలవాట్ల ప్రాబల్యంతో ఇంకా చాలామంది మనస్సుకు అంటి పెట్టుకుని ఉంది; అది చాలా మెచ్చదగిన ఆలోచనైనప్పటికీ పూర్తిగా అత్యంత వైవిధ్యభరిత మత అభిప్రాయాలకూ, మూడు సుస్పష్టమైన సర్వసాధారణ రూపాలైన హిందూ, ఇస్లాం, క్రైస్తవ మతాలకూ, ఈ మతాలు జన్మ నిచ్చిన చెప్పనక్కర లేన టువంటి ఎన్నో ప్రత్యేక రూపాలకూ ఆశ్రయమిచ్చిన దేశంలో అటువంటి ప్రయత్నం అసాధ్యమనేది సుస్పష్టం. ఆధ్యాత్మికత ఏ ఒక్క ప్రత్యేక మతానికన్నా చాలా విస్తృతమైనది....

మహత్తరమైన మానవజీవిత ధ్యేయాలనుగానీ, మన ఆధునిక ప్రపంచపు ప్రధాన సమస్యలను వేటినైనాగానీ, ఏ విధమైన మానవ కార్యాచరణను గానీ, సర్వసాధారణ మైన లేదా అంతర్గత ప్రేరణ లేదా పురోభివృద్ధికీ, విస్తరణకూ, జీవశక్తినీ, ఆనందాన్నీ, వెలుగునూ, శక్తినీ, పరిపూర్ణతనూ మరింతగా పెంచి వృద్ధిచేసే వేటినైనా గానీ

మేము మా పరిధిలో నుంచి బహిష్కరించడమన్నదీ ఆధ్యాత్మికత యొక్క అర్థం కాదు.

కానీ, అప్పటికీ, సృష్టికి సంబంధించి ఆధ్యాత్మికమైన దృక్పథానికీ, పూర్తిగా భౌతికమైన, మానసికమైన దృక్పథానికీ మధ్య వ్యత్యాసం చాలా ఉంది. ఆధ్యాత్మిక దృక్పథం మనస్సునూ, ప్రాణిక జీవితాన్నీ, శరీరాన్నీ మనిషికి సాధనాలుగా చూస్తుంది, అవే ధ్యేయం అనుకోదు, అప్పుడు కూడా, కేవలం అవే అతడి అంతిమ, మహోత్కృష్ట సాధనాలుగా అనుకోదు. అది వాటన్నింటినీ అతని బాహ్య సాధనాపర ఆత్మగా చూస్తుంది. అవే అతని సమస్త అస్తిత్వంగా చూడదు. అది సొంత వస్తువుల వెనుకగల అనంతాన్ని చూస్తుంది, ఏవైతే దోషభూయిష్టమై, వక్రీకరణలతో రూపాంతరం చెంది, తమ నిజస్వరూపాన్ని పొందటానికై వ్యక్తీకరణ దిశగా ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూ ఉంటాయో, అటువంటి పరిమితమైనవాటి ప్రాముఖ్యతను మహోత్కృష్టమైన అనంతానికి చెందిన ప్రాముఖ్యతను బట్టి నిర్ణయిస్తుంది. అది మహోత్కృష్టమైన యథార్థతకై మనిషికీ, ప్రపంచానికీ వెనుక మాత్రమే చూడటం కాకుండా మనిషిలోపలా, ప్రపంచం లోపలా కూడా చూస్తుంది. ఆధ్యాత్మికత మనిషిలోని అత్యున్నతమై ప్రాముఖ్యమైన ఈ అంతరాత్మనూ, ఈ ఆత్మనూ, ఈ దివ్యత్వాన్నీ అతనిలోని ప్రతి ఒక్క ఇతర భాగమూ ఏ రీతిలోనైనా బహిర్గతం చేయడానికీ, వ్యక్తపరచడానికీ తప్పక ప్రయత్నించేటట్లుగా చూస్తుంది. ఈ ఆధ్యాత్మికత మానవుడు దేనినైతే తనకు దృగ్గోచరమవుతున్న వాటన్నింటి యందు ఎల్లప్పుడూ, చూసి, గుర్తించటానికి తపనపడుతూ, ప్రయత్నిస్తున్నాడో అటువంటి ఈ అంతరాత్మతో, ఈ ఆత్మతో, ఈ ప్రపంచంలోని దివ్యత్వంతో అతని ఆలోచనా, జీవితమూ ఐక్యం అయ్యేటట్లు, తద్వారా దానిలో తన తోటివారితో ఐక్యతను పొందేటట్లు చేస్తుంది. ఇది అన్నింటి యందున్న మన సర్వ సాధారణ దృష్టిని తప్పనిసరిగా మార్చివేస్తుంది. మానవ జీవితంలోని ధ్యేయాలన్నింటినీ పట్టి ఉంచుతూ కూడా, వాటన్నింటికీ అది వేరే అర్థాన్నీ, దశనూ నిర్దేశిస్తుంది.

శరీర ఆరోగ్యానికీ, జీవదారుఢ్యానికీ మనం లక్ష్యపెడతాం; కానీ ఏ ఉద్దేశంతో? అది దాని కోసమే, ఎందువల్లనంటే దానిని పొందటం లాభదాయకం; కాదంటే మనం చాలా కాలం జీవించగలుగుతాం, మన మేధస్సుకూ, ప్రాణికానికీ, మానసికోద్వేగాల సంతృప్తికీ అది చక్కటి ఆధారం అవుతుంది అనేది సాధారణంగా వచ్చే సమాధానం. అవును, ఒక విధంగా, అది దాని కోసమే. కానీ ఈ భావనలో భౌతికం కూడా ఆత్మ

వ్యక్తీకరణయేననీ, దానికది పరిపూర్ణతను కలిగి ఉండటం శ్రేష్టదాయకమనీ, పరిపూర్ణ జీవనధర్మంలో అదీ అంతర్భాగమే అనే విషయం విదితమవుతున్నది. కానీ అంతకు మించి, దివ్యాత్మను మనిషిలో దర్శించి, వ్యక్తపరచే ఆ మహోన్నత కార్యాచరణకు అది ఆధారం అవుతున్నది. శరీరం ఖలు ధర్మసాధనం అనేది ప్రాచీన సంస్కృత ఆర్యోక్తి. శరీరం కూడా ధర్మాన్ని సఫలీకృతం చేయడానికి సాధనమే, దైవం వైపు నడిపే మన అస్తిత్వ ధర్మం అయి ఉంది. మనలోని మానసికమైన, భావోద్వేగభరితమైన, సౌందర్యాత్మక విభాగాలను అభివృద్ధిపరచాలి అనేది సాధారణ దృక్పథం. దాని వలన అధికతరమైన సంతృప్తి పొందడం కోసం, అది మనిషి సున్నిత స్వభావమే గనుక, ఆ స్వభావం వల్ల తాను మరింత ఇంకా మరింత నిండుగా జీవిస్తున్నట్లు, ధన్యుడనయ్యానని అనుకొన గలుగుతాడు గనుక వాటి నభివృద్ధి చేయాలి అనేది సాధారణ దృక్పథం. ఇది, కేవలం ఇది మాత్రమే కాదు. ఎందువల్లనంటే ఇవి కూడా ఆత్మకు వ్యక్తీకరణాలే, అవన్నీ అతనిలో తమ దివ్యత్వం కోసం తరచి వెతుకుతుండేవే, వాటి వృద్ధితోనూ, అతి సూక్ష్మగ్రాహ్యతతోనూ, ఏ విధంగానైనా మలచబడగలిగే మృదుత్వంతోనూ శక్తితీవ్రతలతో అతడు ప్రపంచంలో దివ్యసత్యానికి సమీపంగా రాగలుగుతాడు, దానిని పలు విధాలుగా తన వశం చేసుకోనేందుకు, దానితో కాలక్రమంలో తన జీవిత సర్వస్వాన్ని సమశ్రుతిని ఏకం చేసి సుస్థిరం చేయడానికీ అతడు దివ్యసత్యానికి చేరువగా రాగలుగుతాడు. సంఘాన్ని కొనసాగేటట్లు చేసే, మరింత శ్రేయోదాయకంగా, మరింత సహేతుకతతో, మరింత ఆత్మసంయమనంతో, మరింత సానుభూతి చూపగల విధంగా మరింత ఆత్మనిగ్రహంతో తోటివారితో వ్యవహరించగలిగేటట్లు చేసే మంచినియమాలు గల వ్యక్తిగత, సాంఘిక ప్రవర్తనయే నైతికత అని సామాన్య దృక్పథం. కానీ, నైతికత, ఆధ్యాత్మికత దృక్కోణంలో ఇంకా చాలా విశిష్టమైనది. అది మన కర్మల్లో ఇంకా ముఖ్యంగా మన అస్తిత్వ సహజ లక్షణాలలో దివ్యాత్మను అభివృద్ధి చేసే సాధనోపాయం. దైవపరమైన ప్రకృతికి మనం ఎదగడానికి అది ఒక మెట్టవుతుంది.

కనుక, మన లక్ష్యాలు, చేతలు అన్నింటితో ఆధ్యాత్మికత ఆ విధంగా ముడివడి ఉంది; ఆధ్యాత్మికత వాటన్నింటిని తీసుకుని, వాటికి ఇంకా ఎక్కువ మహత్వాన్నీ, ఇంకా ఎక్కువ దివ్యత్వాన్నీ, ఇంకా ఎక్కువ సన్నిహితం అనే స్పృహనూ కలిగిస్తుంది. వేదాంతం పాశ్చాత్యపద్ధతిలో హేతుబుద్ధి ప్రకాశంతో, నిష్పాక్షికంగా ఉనికికి సంబం

ధించిన ప్రథమ సత్యాలను విచారిస్తుంది; వాటిని విజ్ఞానశాస్త్రం (సైన్సు) మన ముందుంచిన యథార్థ విషయాలను, ఘటనలను పరిశీలించడంతోనూ, లేదా ఎంతో జాగ్రత్తగా తార్కిక న్యాయంతో నిశితంగా, హేతువు ప్రతిపాదించిన వాటిని పరిశీలించడంతోనూ లేదా ఆ రెండు పద్ధతులనూ కలగలిపిన విధానంతోనూ మనం తెలుసుకోగలుగుతాం. కానీ ఉనికికి సంబంధించిన సత్యాన్ని కేవలం హేతువుతోనూ, విజ్ఞాన శాస్త్రి పరిశీలనతోనూ మాత్రమే కాకుండా అంతర్బుద్ధి ద్వారా గానీ, అంతరంగం అనుభవ ప్రమాణంతో గానీ తెలుసుకోవాలనేది ఆధ్యాత్మిక దృక్కోణం అభిమతం; వేదాంతం పనిచేసే విధానం వివిధ జ్ఞానమార్గాలు అందించిన విషయ సముదాయాన్ని దేనినీ పరిత్యజించకుండా వాటన్నింటినీ సంయోజనపరచి ఏకైక మహాసత్యమూ, ఆ ఒక్కటే అయిన పరమాత్మా, ఆ సార్వజనీన యథార్థతతో కృతక సంబంధాన్ని కలిగిస్తుంది. అంతిమంగా, దాని నిజమైన యోగ్యత ఆధ్యాత్మిక సంసిద్ధికీ, మానవ అస్తిత్వం తన దివ్యాత్మలో, దివ్యప్రకృతిలో పురోభివృద్ధి చెందడానికీ ఒక ఆధారాన్ని తయారుచేయడంలో ఉంది. విజ్ఞానశాస్త్రం కూడా కేవలం ప్రపంచ జ్ఞానానికి సంబంధించినదే అయి ఉంది. అది మరింత వెలుగును విశ్వదైవాత్మ మీదా, విషయాలలో ఆయన విధానాల మీదా ప్రసరింపజేస్తుంది. అది భౌతిక విజ్ఞానానికీ, దాని ఆచరణాత్మక ఫలితాలకీ లేక జీవితానికీ, మనిషికీ, మనస్సుకూ పదార్థమే ఆధారమనే సిద్ధాంతంతో జ్ఞానం అందించే ఆలోచనకూ లేక భౌతికశక్తే మన ఆవిర్భావానికి మూలం అనే భావానికీ పరిమితం కాదు; ఆధ్యాత్మికమయమైన సంస్కృతి తన అన్వేషణలో కొత్తపుంతలకూ, కొత్తవీ, పాతవీ అయిన మనోవిజ్ఞాన శాస్త్రాలకూ, ఫలితాలకూ దారితీయగా, వాటన్నింటికీ ఆత్మ ప్రథమ సత్యమనీ, దాని నుంచీ మొదలుపెట్టి, మనోశక్తితో, మనస్సుకు మించిన మహోన్నతమైనదానితో జీవితం మీదా, పదార్థం మీదా పనిచేస్తుంది. అత్యంత ప్రాచీన కాలానికి చెందిన కళా, కవిత్వమూ మనిషికీ, ప్రకృతికీ అద్దం పడుతూ సౌందర్యాత్మక బుద్ధికీ, కళాత్మక రూప నిబద్ధతకూ మేధస్సు జీవితాన్ని చూపించే భావాలతో, ఊహల ప్రతిస్పందనలతో సంతృప్తి కలిగే విధంగా ప్రతి రూపాలను సృష్టించడమే లక్ష్యంగా ఉన్నది; కానీ ఆధ్యాత్మిక సంస్కృతిలో అవన్నీ మనిషిలోనూ, మహాప్రకృతిలోనూ దాగివున్న మహత్తర విషయాలనూ, వాటి అత్యంత ప్రగాఢమైన ఆధ్యాత్మిక, సార్వత్రిక సౌందర్యాన్నీ బహిర్గతం చేసే లక్ష్యాన్ని కలిగి ఉంటాయి. రాజకీయం, సమాజం, ఆర్థికవ్యవస్థ అనేవి మానవజీవితం మొదటి

దశలో కేవలం మనుషులు సమిష్టిగా జీవించడానికీ, ఉత్పత్తీ, కోరికలను సంతృప్తి పరచుకోవడానికీ, భోగించడానికీ, శారీరకంగా, ప్రాణికంగా, మానసికంగా వృద్ధిపరచుకునే అమరికకు మాత్రమే పనిచేసినై. కానీ, ఆధ్యాత్మిక లక్ష్యం వీటన్నింటికీ మించి వారిని తయారుచేస్తుంది. ముందుగా, ఒక జీవన చట్రాన్ని తయారుచేసి దాని ద్వారా మనిషి తన నిజాత్మనూ, దివ్యత్వమునూ అన్వేషించగలిగి, ఎదగడానికి దోహదం చేస్తుంది. తరువాత, జీవితంలో దివ్యధర్మాన్ని కలిగిన అస్తిత్వరూపధారణకూ, ఆ పిదప, మానవజాతి పరిణామ ప్రక్రియలో పొందాలని ప్రయత్నిస్తున్న ప్రకాశమూ, శక్తీ, శాంతీ, ఏకత్వమూ, సామరస్యతల దివ్యప్రకృతి దిశగా సమిష్టిగా అందరూ పురోగమించడానికీ దోహదం చేస్తుంది.. ఇలా ఇంతకంటె ఎక్కువా తక్కువా కాకుండా జాతి తన సంపూర్ణ అంతర్నిహిత శక్తులతో కొనసాగడాన్ని మనం ఆధ్యాత్మిక సంస్కృతిగా అర్థం చెప్పుకొంటాం. ఆధ్యాత్మికతను జీవితానికి అనువర్తించుకోవటం అనీ అంటున్నాము.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా. త్రిపురారిభట్ల ప్రసన్నకృష్ణ

భారతీయ సంస్కృతి మొదటి విశిష్ట లక్షణం

శతాబ్దాల పాటు సాగించిన శిక్షణ వల్ల సృష్టిలో దాగివున్న అంతర్నిహిత పరమ సత్యాలకు అతి సన్నిహితంగా భారతీయులు అజ్ఞాన జనబాహుళ్యం సైతం జీవిస్తున్నారు. అయితే ఒక విశ్వజనీనమైన మరీ అంత దట్టంగా లేని తెరల వల్ల వాటి నుండి వారు దూరమయ్యారు. భగవంతుని, పరాత్పరుని, శాశ్వత తత్వపు విస్పష్ట సాక్షాత్కారాల వైపు ఇతర దేశస్థుల కన్నా, సంస్కృతి పొందిన కొద్దిమంది మేధావుల కన్న తేలికగా ప్రయాణించగలరు. ఇది భారతీయుల, వారిలో అజ్ఞానమయ సామాన్య భారతీయుల వైశిష్ట్యంగా పేర్కొనవచ్చును.... బలీయమైన ఈ ఆధ్యాత్మిక మలుపు, పారమార్థిక సన్నిహితత్వం, మహోన్నత సత్యం వైపు భారతజాతి మనస్సు తిరగడానికి సన్నద్ధం కావడం, మహోత్కృష్ట ఆధ్యాత్మిక సంస్కృతీ ప్రాభవానికి చిహ్నంగా భావించాలి.

మనస్సు, జీవితంకన్నా, మహనీయమైన సత్యాన్ని గుర్తించడమే ఇప్పటివరకు ఆధ్యాత్మికత అని అర్థం చెబుతూ వచ్చారు. అంతే కాదు మన సామాన్య మానస, ప్రాణిక కోశాలకు అతీతంగా మెరిసే వినిర్మల, దివ్య, ఘనాతిఘనమైన చైతన్యం కోసం ఆకాంక్ష, మన నిమ్నభాగాల అల్పత్వం, వాటితోగల బంధాల నుండి మన ఆత్మ బయటపడి మనిషిలో రహస్యంగా వున్న ఉన్నత సత్యం వైపు అధిరోహించడం ఆధ్యాత్మికతగా భావించారు.

భారతీయుల ఆలోచనాధారలో అది ముఖ్యభావన, అనుభవ దర్శనం, అదే భారతీయుల ఆలోచనల మహత్వసారం.

*

ఆధ్యాత్మిక ఆకాంక్ష భారతీయ సంస్కృతిని పరిపోషించే ప్రధానశక్తి. అదే దాని ఆలోచనాసారం. అదే దాని సార్వభౌమ కాంక్ష. ఆధ్యాత్మికతను మహోన్నత లక్ష్యంగా చేయడమే కాకుండా, ప్రాచీనకాల పరిస్థితులలో చేయదగినంతగా, మొత్తం మానవజీవితాన్ని ఆధ్యాత్మికత వైపు ఈ సంస్కృతి మళ్లించింది. మతం, మనస్సులో నుండి పుట్టిన అభిమతం. ఆధ్యాత్మిక ఉద్వేగానికి అపరిపూర్ణ రూపం మతం.

ఆధ్యాత్మిక భావన ప్రధానంగా ప్రభావితం చేయడంలో, జీవితాన్ని తన గుప్పెట్లోకి తీసుకొనే యత్నంలో ఆలోచనలను, కార్యాచరణను మతపరమైన మూసలోనే బిగించవలసిన అవసరం ఏర్పడింది. జీవితంలోని ప్రతి పరిస్థితిలోను మతపరమైన పరమార్థాన్ని నిక్షిప్తం చేయవలసి వచ్చింది. సర్వవ్యాప్తమైన మత-తాత్విక సంస్కృతి అవసరమని గుర్తించింది. దానిని గట్టిగా పట్టుపట్టింది.


*

ఆధ్యాత్మికత భారతీయమేధస్సుకి అత్యంత కీలకమైనది. సత్యం అనంతం అన్న భావన ఆ జాతికి వెన్నతో పెట్టిన విద్య. హేతువు పాలించిన యుగాలలో, అజ్ఞానం ఆవరించిన యుగాలలో సైతం తన అంతర్దృష్టిని కోల్పోలేదు. బాహ్యమైన వెలుగులో, జీవితాన్ని సక్రమంగా దర్శించలేమని, బాహ్యమైన శక్తివిన్యాసాలలో జీవితాన్ని పరిపూర్ణంగా జీవించలేమని భారతదేశం సృష్ట్యాదిలోనే వీక్షించింది. భౌతికనియమాలు, శక్తుల మహ నీయత ఏమిటో భారతజాతికి తెలుసు. భౌతిక విజ్ఞానశాస్త్రాల ప్రాధాన్యమేమిటో భారతదేశం గ్రహించింది. సామాన్య జీవన కళారూపాలను ఏ విధంగా వ్యవస్థీకరించాలో ఆమెకు తెలుసు. భౌతికానికి అతీతంగా వున్నదానికి సంబంధించి,

సరియైన శ్రేణిలో నిలబడకపోతే, భౌతికానికి పూర్ణ పరమార్థం ఉండబోదని ఆమెకు తెలుసు. ఈ ప్రపంచం ఒక ప్రహేళిక. మనస్సుకు అందని ఎన్నో దుర్గ్రాహ్య విషయాలు ఉన్నాయి. మనిషి బాహ్యదృష్టికి అందని ఎన్నో ముడులు, రహస్యాలున్నాయి. ఈ విశ్వం యవనిక వెనుక ఎన్నో ఇతరేతర శక్తులున్నాయి. మనిషి లోపలే అనేక శక్తులున్నాయి. వాటి గూర్చి అతనికి అసలు తెలియదు. తన గూర్చి బహు కొద్దిగానే అతనికి తెలుసు. దృశ్య మానమైనవాటి చుట్టూ అదృశ్య మైనదేదో ఆవరించి వుంటుందని, అతీంద్రియమైనది ఏదో ఇంద్రియాలను ఆవరించి వుంటుందని, అనంతం ఎప్పుడూ సాంతాన్ని అల్లుకొని వుంటుందని భారతజాతికి తెలుసు. తనను తాను అతిక్రమించే శక్తి మనిషికి ఉంది. తాను ఉన్న స్థితికి మించి మరింత పూర్ణ ప్రగాఢ వ్యక్తిత్వంగా మారవచ్చును అని భారతజాతికి తెలుసు. మనిషికి అతీతంగా త్రింశత్కోటి దేవతలను చూసింది. దేవతలకు అతీతంగా భగవంతుడెవరో తెలుసు. భగవంతుని సాక్షాత్కారం పొంది, మనిషి యొక్క అవర్ణనీయ చిరంతనత్వం తెలుసుకోగలిగింది. ఈ జీవితానికి అతీతంగా ఉన్నత జీవిత శ్రేణులు, భూమికలు చూసింది. ప్రస్తుత మనస్సుకు అతీతంగా ఎన్నో దివ్యభూమికల్ని చూసింది. వాటికి ఇంకా అతీతంగా ఆత్మ వెదజల్లే దివ్య కాంతిపుంజాలు చూసింది. ఆమె అంతః స్ఫూర్తి అల్పత్వం, భయం ఎరుగదు. ఆధ్యాత్మిక, బౌద్ధిక, నైతిక, ప్రాణిక ధైర్యసాహసాల నుండి ఏ నాడూ వెనుకంజ వేయలేదు. మనిషి తన సంకల్పాన్ని అభివృద్ధి చేసుకొంటే, వాటిలో మనిషి సాధించలేనిది లేదు. మనిషి ఈ దివ్య భూమికల్ని జయించగలడు. ఆత్మగా రూపాంతరం చెందగలడు. దేవతగా మారగలడు. భగవంతునితో సాయుజ్యం చెందగలడు. బ్రహ్మతత్వమై భాసించగలడు. తర్కబద్ధమైన ఆచరణ, శాస్త్రబద్ధమైన ఆలోచన, వ్యవస్థీకృత విధానం ఇవి ఆమె మనస్తత్వ విశిష్టత్వానికి మచ్చుతునకలు. మార్గం కనుగొనడానికి ఆమె సిద్ధమైంది. ఎన్నో యుగాల ఆత్మదృష్టి, ఆచరణ కారణంగా ఆధ్యాత్మికత, శక్తివంతమైన చైత్యవికాసం, అనంతాన్ని అందుకొని, సాంతం చేసుకోవాలనే ఆకాంక్ష, చెక్కుచెదరని మతదృక్పథం, యోగవిధానం, కళలు తత్వశాస్త్రం ఆమెలో నాటుకు పోయినాయి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న



భారతీయ సంస్కృతి రెండవ విశిష్ట లక్షణం

కాని... ఆధ్యాత్మికత శూన్యంలో వికాసం చెందలేదు. మబ్బులలో నుండి స్వప్న సమ్మోహన దృశ్యంలాగ ఆధారం లేకుండా పర్వతశిఖరాలు పెరగలేవు. భారతదేశ గతంలోకి చూస్తే, భారతజాతి బ్రహ్మాండమైన ప్రాణశక్తి, ఎప్పటికీ తరగని జీవనశక్తి, జీవన ఆనందం, ఊహకు అందని ఆమె అతివిస్తార సృజనవైభవం — ఇవన్నీ మనల్ని ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. కనీసం మూడువేల సంవత్సరాల నుండి నిజానికి — ఇంకా ముందు నుంచి — నిరవధికంగా, పుష్కలంగా, తరగని బహురూప ప్రాభవంతో రాజ్యాలు, సామ్రాజ్యాలు, ప్రజాప్రభుత్వాలను, తత్వశాస్త్రాలను, విశ్వ శాస్త్రాలు, విజ్ఞానశాస్త్రాలు, మతశాఖలు, కళలు, కవితలు, రాజప్రాసాదాలు, ఆల యాలు, ప్రజానిర్మాణాలు, సమాజాలు, మత వ్యవస్థలు, శాసనాలు, చట్టాలు, యజ్ఞ యాగాది క్రతువులు, భౌతిక, ఆధ్యా త్మిక శాస్త్రాలు, యోగవిధానాలు, రాజకీయ, పరిపాలన వ్యవస్థలు, ఆధ్యాత్మిక కళలు, ప్రాపంచిక కళలు, వ్యాపారాలు, పరిశ్రమలు, హస్త కళలు, భారతజాతి సృష్టిస్తోంది. ఈ జాబితా అంతులేనిది. ప్రతి శాఖలోనూ అధిక చక్కని కార్యశీలత కనిపిస్తుంది. ఆమె సృష్టిస్తుంది, సృష్టిస్తుంది. సంతృప్తిచెంద లేదు. విసుగు చెందలేదు. దీనికి అంతులేదు. విశ్రాంతికి స్థలం వెతకదు. జడమయంగా నిలబడే తీరిక లేదు. మెట్టభూమిగా మారే అవకాశం లేదు. సరిహద్దులు దాటి ఆమె ప్రాభవం విస్తరించింది. ఆమె నౌకలు సముద్రాలు దాటి, ఆమె మితిమీరిన సంపద వెల్లువగా జూడియా, ఈజిప్టు, రోమ్ దేశాలను ముంచెత్తింది. చుట్టూ వున్న దీవులలో ఆమె తన కళలను, మతవిశ్వాసాలను, కార్యాలను వెదజల్లింది. మెసొపొటా మియా ఇసుకతీరాలలో ఆమె జాడలు కనిపించాయి. ఆమె మతాలు చైనా, జపాన్‌లను జయించాయి. పాలస్తీనా, అలెగ్జాండ్రియా వరకు వ్యాపించాయి. ఉపనిషత్ మంత్రాలు, బౌద్ధప్రవచనాలు క్రైస్తు పెదవులపై ప్రతిధ్వనించాయి. ఆమె నేలపై, ఆమె నిర్మాణా లతో పుష్కలమైన జీవన శక్తి తాండవించింది.

ఆమె ప్రాచీన శిల్పకళావైభవం,కళలలో మౌనరాగాలు లేవు. ఖాళీ ప్రదేశాలు లేవు. సుసంపన్నత ఉపసంహరించలేదు. ప్రతి పగులులోనూ ఖనిజాలతో నింపింది. ప్రతి అంగుళాన్ని సంపన్నం చేసింది అని యూరోపియన్ విమర్శకులు ఫిర్యాదు చేశారు. ఓహో! అది లోపమో, మరి కాదో! ఆమె జీవన వైవిధ్యం, బ్రహ్మాండమైన

శక్తి సంపద అది. ఆమెలోని అనంతత్వపు ప్రతిస్పందన అది. ఆమె అనంతం. ఆమె అనంత సంపదలను వెదజల్లింది. రోదసీ అంతా అణువణువూ అనంతం ఆక్రమించినట్లు, ఆమె జీవితం, శక్తులు సమస్తాన్ని ముంచెత్తాయి. ఆమె అనంత సువర్ణ భారతం!

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

భారతీయ సంస్కృతి — మూడవ విశిష్ట లక్షణం

కాని ఈ మహోన్నత ఆధ్యాత్మికత, ఈ జీవన ఆనందహేల, శక్తి సమృద్ధి, సృష్టి — ఇవి గతంలో భారతాత్మకు మూలస్తంభాలు కావు. వినిర్మల వినీల ఆనంతస్వర్గాల క్రింద పంటల పసిడి వెలుగుల గందరగోళం కాదు. అటువంటి అపారసంపదను తిలకించలేని నేత్రాలకు జీవన సుసంపన్న రూపాల సమూహాలలో గందరగోళం కని పిస్తుంది. మితమీరిన సంపదల విలాసవంతమైన క్రమభంగం కనిపిస్తుంది. సమతుల్యం, నమూనా, కొలతలు లేనట్లు కనిపిస్తుంది. భారతీయ సంస్కృతి తృతీయశక్తి పటిష్టమైన మేధాసంపత్తి. అది సుసంపన్నం, పరమ నిష్ఠాగరిష్టం, పుష్టి గలది, అతి సూక్ష్మ వివేచన గలది, శక్తిప్రదమైనది, సున్నితమైనది, సూత్రరీత్యా బహువిశాలమైనది. వివరాలలో ఉత్సుకతను రేకెత్తించేది. అందులో ఒక క్రమపద్ధతి, చక్కని ఏర్పాటు కనిపిస్తాయి. అంతర్గత నియమావళి అన్వేషించడం పైన, సత్యం పైన, ఆధారపడిన క్రమపద్ధతి, జాగ్రత్త వహించిన ఆచరణ మనకు కనిపిస్తుంది. భారతదేశం ప్రధానంగా ధర్మభూమి* అంతా శాస్త్రం ఆధారంగా నడుస్తుంది. ప్రతి మానవుని లేక విశ్వ కార్యసరళిలోని అంతర్గతసత్యాన్ని, నియతిని అన్వేషించింది. భారతీయధర్మం ఏమిటో తనకు తాను నిర్దేశించుతుంది. ఆ ధర్మాన్ని జీవననియమాలలో, యదాతథ జీవనవిధానంలో వర్తింపచేస్తూ, మరింత విస్తృతరూపంలో సవివరాత్మక నియమాలలో నిక్షిప్తం చేసింది. పరమాత్మ ఆవిష్కరణతో ఆమె తొలి యుగాలు కాంతివంతమ య్యాయి. తరువాతి కాలం ధర్మావిష్కరణతో పరిపూర్తి అయింది. శాస్త్రబద్ధ

* *ధర్మం అంటే సమస్తాన్ని పట్టి ఉంచేది అని, నియమం, ప్రమాణం, స్వభావనియతి, కార్యాచరణ, జీవితం అని అర్థం.*

జీవితం వివరాలను అనంతరయుగాలలో విస్తృతం చేసింది. ఏ ఒక్కదానికి అగ్ర ప్రాధాన్యం ఇవ్వకుండా మూడూ ఎల్లప్పుడూ కలిసి ఉంటాయి.

జీవితాన్ని శాస్త్రం, కళ పరిధిలో ఆసక్తికరంగా విస్తరింపచేసి అసాధారణ స్థాయికి తీసుకొని వెళ్లింది. అశోకుని నుండి మహమ్మదీయుల పాలన వరకు మేధాసంపదతో చేసిన నిర్మాణాలు బ్రహ్మాండమైనవి. ఇటీవల దీనిపై పరిశోధించిన పండితుల వివరాలు ఆశ్చర్యజనకమైనవి. ఎంతో సాధించినదానిలో భిన్నరాశి అది. గతంలో రాసింది, తెలియబడినదానిలో కొంచెమే మనకు అందింది. ప్రచురణ సౌకర్యం లేని సమయంలో చేసిన పరిశ్రమకు, కార్యాచరణకు చరిత్రలో పోలికే లేదు. ఈ సౌకర్యాలు లేని సమయంలో అంతటి పరిశోధన, ఉత్పత్తి, వివరాలు భారతజాతి సాధించింది. కేవలం స్మృతి ద్వారా, తాళపత్రాల ద్వారా వాటిని కాపాడగలిగారు. అంతకు మించిన సాధనాలు లేవు.

ఈ సువిశాలమైన వాఙ్మయం తత్త్వశాస్త్రానికి, పురాణాలకు, దివ్య జ్ఞాన సంపదకు, మతం,యోగ, తర్క, వ్యాకరణ, భాషాసంపదకు, కవిత్వం, నాటకాలు, వైద్యం, భూగోళవిజ్ఞానం, ఇతర శాస్త్రాలకు మాత్రమే పరి మితం కాలేదు. జీవనసర్వస్వాన్ని, రాజకీయాలను, సమాజాన్ని తైలవర్ణ చిత్రాల నుండి నాట్యం వరకు అన్ని చతుష్షష్టి కళలను తన పరిధిలోకి తీసుకొంది. జీవితానికి ఉపయోగకరమైనవాటిని, మనస్సుకు ఆసక్తికరమైన వాటిని, గుర్రాలకు, ఏనుగులకు శిక్షణ ఇచ్చే శాస్త్రాలను సైతం తన పరిధిలోకి తీసుకొంది. ప్రతి శాస్త్రానికి తగిన కళ, సాంకేతిక సూత్రాలకు సంబంధించిన సాధనాలు, సాహిత్యం ఉన్నాయి. అతి పెద్ద అంశాలనుండి, అత్యల్ప అంశాల వరకు సుసంపన్న మైన, అతిసూక్ష్మ మైన, సర్వాన్ని ఇముడ్చుకోగల మేధాసంపద భారతీయుల స్వంతం. ఒక వైపు సంతృప్తి చెందని ఆసక్తి, జీవితాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోవాలన్న కాంక్ష, మరో వైపు వ్యవస్థీకృతం చేయగల స్ఫూర్తి, జాగరూకతతో కూడిన సక్రమ పద్ధతి కనిపిస్తాయి. సామరస్యంతో కూడిన జ్ఞానంతో, చక్కని లయతో నడవాలన్న మనస్సు, ఆకాంక్ష కనిపిస్తుంది. అంతటినీ ప్రభావితం చేసే ఆధ్యాత్మికత, అంతులేని ప్రాణిక సృజనాత్మక ప్రాభవం, జీవిత ప్రచండ వీచిక, వాటి మధ్య మధ్యవర్తిత్వం నెరపే శక్తివంతమైన, అతి సునిశితమైన ప్రజ్ఞ, అత్యున్నత ఉద్వేగభరితమైన కార్యాచరణతో కూడిన సహేతుక, నైతిక, రసాత్మక మనస్సు — ఇవి ప్రాచీన భారతీయ సంస్కృతి సామరస్య వైభవాన్ని సృష్టించాయి.

తన ఆధ్యాత్మిక ధోరణులతో ఎంతగానో సాధించినదాన్ని, సమృద్ధమైన ఈ ప్రాణికశక్తి, మేధస్సు లేకుండా భారతదేశం ఎన్నటికీ సాధించగలిగి వుండేదీ గాదు. సగం హరించబడన జీవశక్తితో, నిరుత్సాహపరుచబడిన, కించపరచబడిన మేధస్సుతో పేదరికం తాండవించే దేశంలో ఆధ్యాత్మికత బాగా విరాజిల్లుతుందని భావించడం పెద్ద తప్పు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

భారతీయమతము

హిందూమతము అన్న పేరుతో నేడు ప్రచారంలోకి వచ్చిన ధార్మిక సంస్కృతికి ఒక పేరంటూ లేదు. ఎందుకనగా అది వర్గపరమైన పరిమితు లను విధించుకోలేదు. తాను విశ్వవ్యాప్తమైన మతమని కూడా చాటుకో లేదు. తిరుగులేని ఏకైక సిద్ధాంతాన్ని కూడా అది ధృవీకరించలేదు. ముక్తికి ఒక సంకుచితమైన మార్గాన్ని లేక ద్వారాన్ని అది ఏర్పరచలేదు. దైవాభిముఖంగా సాగు మానవ ఆధ్యాత్మిక ప్రయత్నంలో నిర్విరామంగా విస్తరించే సంప్రదాయంగా అది రాణించిందేగాని ఒక నిబద్ధమైన విశ్వాసంగా కాని, పద్ధతిగా కాని కాదు. అది ఆధ్యాత్మికమైన ఆత్మోన్నతికి, ఆత్మాన్వే షణకు వివిధ దశలతో కూడిన బహుముఖ ప్రణాళిక, తనకు తెలిసిన సనాతన ధర్మము అన్న ఒకే ఒక పేరుతో వ్యక్తమగుటకు దానికి కొంత అధికార మున్నది.

ఏష ధర్మః సనాతనః

(ఇది శాశ్వత ధర్మము)

ఏష ధర్మః సనాతనః హిందూధర్మం ఒక మతం గాని లేక ఒక అహేతుక విశ్వాసంగాని కాదు. కొన్ని సూత్రాల సముచ్చయం కాదు. సాంఘిక నియమాల నిబంధనము కాదు. అది ఒక శక్తిమంతమైన, శాశ్వతమైన, విశ్వజనీనమైన సత్యము. అనంతమగు భగవంతుని అస్తిత్వముతో మానవుని ఆత్మను ఏకముచేయు విధానంలోని రహస్యాన్ని గ్రహించిన ధర్మమిది.

(14 మార్చి 2908)

అయితే హిందూధర్మమంటే ఏమి? సనాతనము అని మనం వ్యవహరించే ఈ ధర్మస్వరూపం ఎలాంటిది? హిందూజాతి దీనిని పరిరక్షించినందువలన, హిమాలయాలు, సముద్రంచే పరివృతమై వేరుచేయబడిన ఈ ద్వీప కల్పంలో ఇది పెరిగినందువలన, ఈ పవిత్రమైన ప్రాచీనభూమిలో, దీనిని యుగాల పర్యంతం కాపాడే బాధ్యత ఆర్యజాతికి అప్పగించబడడం వలన ఇది హిందూధర్మంగా గణనకెక్కింది. అంతేగాని, ఒక్క దేశానికిది పరిమితం కాదు. విశేషించి భూవలయంలోని ఒక భాగానికి శాశ్వతంగా సంబంధించినది కాదు. మనం హిందూధర్మమని వ్యవహరించునది నిజంగా సనాతన ధర్మం. ఎందుకనగా ఇతరులు అందరికీగూడా అన్వయించే విశ్వ జనీన ధర్మమిది. విశ్వజనీనంకాని ధర్మం శాశ్వతం కాజాలదు. ఒక సంకుచితమైన ధర్మం, ఒక వర్గానికి ముడిపడిన ధర్మం. ఒక ప్రత్యేకమైన ధర్మం, కొంత పరిమిత సమయం వరకే, పరిమిత ప్రయోజనాన్ని సాధించటానికి మాత్రమే జీవించగలదు. ఇటు విజ్ఞానశాస్త్రిము యొక్క ఆవిష్కరణలను, అటు తాత్వికశాస్త్రి చింతనలను తనతో సమన్వయించు కొని భౌతిక వాదంపై విజయం సాధించగలిగినది హిందూధర్మం మాత్రమే. జీవునితో దేవునికిగల సాన్నిహిత్యాన్ని గుర్చి మానవజాతిని ప్రభావితం చేయగలిగినది, మానవుడు దేవుని చేరుకొనుటకు అవసరమైన మార్గాల నన్నింటిని తనలో విలీనం చేసుకోగలిగినది ఈ ధర్మమొక్కటే. పరమాత్మ అందరిలోనూ, అన్నింటిలోనూ ఉన్నాడని, ఆయనలోనే మనం మన అస్తిత్వాన్ని కలిగియున్నామని, సకలమతాలు అంగీకరించిన సత్యాన్ని అనుక్షణము నొక్కి వక్కాణించేది ఈ ధర్మమొక్కటే. ఈ సత్యాన్ని అవగతం చేసుకొని విశ్వసించడమేగాక, మన ఉనికిలో అడుగడుగున దానిని సాక్షాత్కరించుకొనే శక్తిని ప్రసాదించునది కూడా ఈ ధర్మమే. జగత్తు యొక్క నిజస్వరూపమేమిటో, అది వాసుదేవుని లీల అని ప్రపంచా నికి నిరూపించగలిగినది ఈ ధర్మం మాత్రమే. మరియు ఆ లీలలో మనం మన పాత్రను ఎలా అత్యుత్తమంగా పోషించాలి, సూక్ష్మ మైన అందలి నియమాలను, గంభీరమైన అందలి నిబంధనలను ఎలా అనువర్తించాలి అని చూపగలిగినది ఈ ధర్మం మాత్రమే. ధర్మమునుండి కించిత్తు కూడా జీవితాన్ని వేరుపరచనిది, అమృతత్వమనగా ఏమిటో గ్రహించినది, మృత్యువు యొక్క వాస్తవికతను పూర్తిగా మన నుండి దూరం చేసినది ఈ ధర్మమొక్కటే.

(30 మే 909)

మతము యొక్క యథార్థ ప్రయోజనం మరియు హిందూమతం యొక్క సార్వజనీనత

అంతరాత్మను వికసింపజేయడానికై ప్రకృతి తన ప్రయత్నంలో అనుసరించిన ప్రధాన విధానాలు నాలుగు 1. మతము 2. గుప్తశక్తి 3. ఆధ్యాత్మికచింతన 4. ఆత్మసాక్షాత్కారము మరియు తదనుభవము. ఇందులో మొదటివి మూడూ మార్గాలు కాగా చివరిది నిశ్చితమైన ప్రవేశ ప్రాంగణము. ఈ నాలుగుశక్తులు ఇంచుమించుగా ఒకదానితో నొకటి సంబంధపడి, ఏకకాలిక చర్యతో, కొన్ని సమయాల్లో మార్పుతోకూడిన సహకారంతోను, మరికొన్ని వేళలలో పరస్పర వివాదంతోను, మరికొన్ని సందర్భాలలో ప్రత్యేక స్వేచ్ఛతోను కృషిసల్పాయి. తన కర్మకాండ లోను, శుభాశుభకార్యాలలోను, సంస్కారాలలోను మతము ఒక గుప్త మూలవిధానాన్ని అంగీకరించింది. కొన్ని సందర్భాలలో ఒక సిద్ధాంతాన్ని లేక ఒక విశ్వాసాన్ని మరికొన్ని సందర్భాలలో తనకు అవలంబాన్నిచ్చే ఆధ్యాత్మిక తాత్త్వికతను దాని నుండి పొందుతూ అది ఆధ్యాత్మిక భావనపై ఆధారపడి నిల్చింది. ఇందులో మొదటిది సాధారణంగా పాశ్చాత్యపద్ధతి. రెండవది ప్రాచ్యపద్ధతి. కాని మతానికి ఆధ్యాత్మిక అనుభవమే చివరి లక్ష్యం. అదే దాని శిఖరాగ్ర స్థితి.

మానవుని ధార్మిక అన్వేషణలోని యథార్థమైన ఆశయాన్ని కాపాడుతూ, విస్తృతమగు అవకాశాన్ని కల్పించిన విశాల పరిణామ ప్రకృతి మార్గాన్ని భారత దేశంలోని ధార్మిక వికాసక్రమంలో గుర్తించవచ్చు. అందులో ఎన్నో మతసూత్రీకరణలు, విశ్వాసాలు, విధానాలు అనుమతింప బడ్డాయి. ఒకదాని ప్రక్కన ఒకటివుండి పెంపొంద డానికి తగిన ప్రోత్సాహం కూడా లభించింది. ప్రతి మనిషి తన భావనకూ, పకృతికీ, ఉద్దేశానికీ అనుకూలమైన విధానాన్ని ఎంచుకొనే స్వాతంత్ర్యాన్ని కలిగి యుండి నాడు. ప్రయోగదశకు చెందిన పరిణామానికి తగిన ఈ సరళత్వము సరియైనది మరియు యుక్తియుక్తమైది. ఎందుకనగా మతము యొక్క నిజమైన పని మానవుని మనస్సును, జీవితాన్ని, శారీరక అస్తిత్వాన్ని ఆధ్యాత్మిక చైతన్యం గ్రహించుటకు అనువుగా సిద్ధపరచడమే. మతము ఆంతరంగిక ఆధ్యాత్మిక ప్రకాశమును పూర్తిగా వెలుగొందే స్థితికి వ్యక్తిని తీసుకొనిపోవలసి యున్నది. ఇక్కడే మతము తన విధేయతను ప్రకటించుటను నేర్చుకోవాలి. తన బాహ్య లక్షణాలకై బలవంతం చేయక, ఆంతరంగిక

ఆత్మ తన యథార్థతను, సత్యాన్ని సంపూర్ణంగా వృద్ధిపరచుకోవడానికై దానికి పూర్తి అవకాశాన్ని కలిగించాలి. ఈలోగా అది మానవుని మానసికతను, ప్రాణికతను, శారీరకతను సాధ్యమైనంత ఎక్కువగా గ్రహించి, అతని సర్వకార్యాలను ఆధ్యాత్మికత దిశగా తిరుగునట్లు చేయాలి. వాటిలో ఆధ్యాత్మిక పరమార్థం వ్యక్తమగుటను, ఆధ్యాత్మిక పవిత్రతాముద్రను, ఆధ్యాత్మిక శీల ప్రారంభాన్ని కలిగించాలి.

*

విజ్ఞానశాస్త్రాన్ని, విశ్వాసాన్ని, ఆస్తికత్వాన్ని, క్రైస్తవాన్ని, మహమ్మదీయమతాన్ని, బౌద్ధాన్ని తనలో సమన్వయించుకొని కూడా, వాటిలో ఏదీకాకుండా ఉండగలిగిన మతము వైపే విశ్వాత్మ పయనిస్తున్నది. అన్నింటిలోను, అతిశంకితము, అతివిశ్వాసాత్మకము — అన్నింటిని ప్రశ్నించి ప్రయోగించినందువల్ల అతిశంకితము, అగాధమగు అనుభవము, విభిన్నమార్గాలతో కూడిన నిశ్చిత ఆధ్యాత్మిక జ్ఞానము కలిగి యుండుటచే అతివిశ్వాసాత్మకము — అయిన ఏ విశాలమగు హిందూమతం కలదో, ఏది ఒక సిద్ధాంతము లేక కొన్ని సిద్ధాంతాల కూడలి కాదో, ఏది ఒక జీవనవిధానమో, ఏది ఒక సామాజిక చట్రములో బిగించబడక, గడచిన, రానున్న సమాజ పరిణామానికి చెందిన తత్వమో, ఏది దేనినిగాని నిరసిం చక, ప్రతిదానిని పరీక్షించి అనుభవంలోనికి తెచ్చుకోవాలని నొక్కి చెబుతుందో, అలా పరిక్షించి అనుభవించినప్పుడు ఆత్మ యొక్క ప్రయోజనానికే దానిని వినియోగించుకొంటుందో అట్టి హిందూమతములోనే భావి విశ్వమతానికి కావలసిన ఆధారాన్ని మనం చూస్తున్నాము. ఈ సనాతన ధర్మములో వేదాలు, వేదాంతము, గీత, ఉపనిషత్తులు, దర్శ నాలు, పురాణాలు, తంత్రము ఇత్యాది అనేక శాస్త్రగ్రంధాలున్నాయి. అది బైబిలును మరియు ఖురానును కూడా నిరసించదు. కాని దాని యథార్థమైన అధికారికమైన గ్రంథము శాశ్వత సత్యానికి నివాసమైన హృదయంలోనే వున్నది. ప్రపంచ మతగ్రంథాలు, జ్ఞానము, ప్రేమ, శీలములకు సంబంధించిన న్యాయసూత్రము వీటికి చెందిన మూలమును, ప్రమాణమును, మన అంతరంగ ఆధ్యాత్మికానుభవములలోనే మనము దర్శిం చగలము.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: సముద్రాల లక్ష్మణయ్య

భారతీయమత కేంద్రీయ సత్యం

భగవంతుడు నాకు యెత్తిచూపిన తదుపరి విషయం — హిందూమతంయొక్క ప్రధాన సత్యం. దానిని సాక్షాత్కరింప జేసుకొ నేటట్లు నన్ను అతడు తయారుచేసాడు. జైలు అధికారుల హృదయాల్లో నాపై సౌమ్యభావాన్ని నింపాడు. వాళ్లు తమ ఆంగ్లేయ అధికారితో నా గురించి “ఏకాంతంగా చిన్న గదికి పరిమితం చేయడంవల్ల అతను బాధ పడుతున్నాడు. ఉదయసాయంకాలాల్లో కనీసం ఒక అరగంట జైలు ఆవరణలో పచార్లు చేయడాని కనుమతిద్దాం” అని చెప్పారు. ఆ యేర్పాటు జరిగింది. అలా నడుస్తున్న సమయంలో భగవంతుని బలం తిరిగి నాలో ప్రవేశించింది. నన్ను మనుషుల నుండి వేరుచేసిన జైలుగది వైపు చూశాను. నన్ను బంధించేది ఇక నెంతమాత్రం దాని ఎత్తైన గోడలు కాదు, వాసుదేవుడే నా చుట్టూ ఉన్నాడు. నా జైలుగది బయట వున్న చెట్టుక్రింద నడిచాను. కాని అది చెట్టు కాదు, వాసుదేవుడే, శ్రీకృష్ణుడే అచట నిలబడి నాకు తన నీడనిస్తున్నాడు. నా జైలు గది కటకటాల వంక చూసాను. తలుపుగా వున్న ఆ కటకటాల ఇనుపచట్రం వాసుదేవునిగా నాకు దర్శనమిచ్చింది. నారాయణుడే నాకు కాపలా వుండి రక్షిస్తున్నాడు. లేదా నా కిచ్చిన ముతక దుప్పటిపై పడుకున్నప్పుడు, శ్రీకృష్ణుని, నా సఖుని, నా ప్రియుని బాహు బంధాలలో ఉన్న అనుభూతి చెందాను. అతడు నాకు ప్రసాదించిన లోతైన అంతర్దృష్టి వల్ల కలిగిన ప్రయోజనమిది. దొంగలు, హంతకులు, మోసగాళ్లు అయిన, కారాగారంలోని ఇతర ఖైదీలను చూసాను. వాళ్లనలా చూస్తున్నపుడు వాసుదేవుడే కన్పించాడు. మసకబార్చబడిన అంతరాత్మలు, దుర్వినియోగం చేయబడిన దేహాలుగల వీళ్లలో నారాయణుడే కన్పించాడు. ఈ దొంగలు, దోపిడిదొంగల మధ్యలో చాలామంది తమలోని సానుభూతితో, నేను తలదించుకొనేలా చేసారు. అటువంటి విరుద్ధ పరిస్థితులను దయాగుణాల్తో గూడా జయించి మానవత నిలబడింది.

*

క్రింది కోర్టులో మా కేసు విచారణ ప్రారంభ సందర్భంలో మేజిస్ట్రేటు దగ్గరకు మమ్మల్ని తీసుకొచ్చినపుడు ఇదే అంతర్దృష్టి నాలో నన్ను అనుసరించి ఉంది. భగవంతుడు “నిన్ను జైల్లో పెట్టినపుడు నీ హృదయం భగ్నం కాలేదా, నీ రక్షణ ఎక్కడ అని నీవు నన్ను ఉద్దేశించి ఆక్రందించలేదా? ఇపుడు మేజిస్ట్రేటు వంక

చూడు, ప్రాసిక్యూషనువారి వంక చూడు" అన్నాడు. నేను చూసాను, నాకు కనిపించి నది మేజిస్ట్రేటు కాదు, వాసుదేవుడు, నారాయణుడు, న్యాయపీఠం మీద కూర్చుని ఉన్నాడు. ప్రాసిక్యూషను వంక చూసాను. అచట కన్పించింది ప్రభుత్వ న్యాయవాది కాదు, అచట కూర్చుని ఉన్నది శ్రీకృష్ణుడు, నా సఖుడు, నా ప్రియుడు అచట కూర్చుని చిరునవ్వు చిందిస్తూ "ఇంకా భయపడు తున్నావా?" అని ప్రశ్నించి, "నేను మానవులందరిలో ఉన్నాను, వారి మాటలను,చేష్టలను ప్రక్కకు నెట్టి వారిని నియంత్రిస్తాను. నా రక్షణ నీ కింకా వుంది, భయపడకు. నీకు వ్యతిరేకంగా మోపబడిన నేరారోపణను నా కొదిలెయ్యి, అది నీ కోసం ఆరోపింపబడలేదు. నిన్నిక్కడకు తీసుకొచ్చింది మరో పనికిగాని నేరవిచారణకు గాదు. ఈ నేరారోపణ గూడా నా కార్యనిర్వహణావిధానంలో భాగం మాత్రమే. అంతకు మించి మరేం కాదు."

*

భగవంతుడు నా నుండి యేమి ఆశిస్తున్నాడో అంతా నాకు తెలుసు. ఎందుకనంటే, పదే పదే నేను దాన్ని విన్నాను. ఎప్పుడూ నాలో ఒక వాణిని వింటూనే వున్నాను. "నేను దారి చూపుతున్నాను కనుక భయపడకు. ఏ కార్యం కోసం నిన్ను జైలుకు తీసుకొచ్చానో, నీవు విడుదలైన తర్వాత, ఆ నీ కార్యాన్ని నిర్వహించ పూనుకో. గుర్తుంచుకో, భయపడకు, సంశయించకు. ఇదంతా చేస్తున్నది నేనని, నువ్వుగాని, మరెవ్వరుగాని కాదని గుర్తుంచుకో. కాబట్టి ఏ మబ్బులు క్రమ్మినా, ఎన్ని ప్రమాదాలూ, బాధలూ, ఏ యిక్కట్లూ, అసా ధ్యాలూ ఎదురైనా, ఏదీ అసాధ్యం కాదు, ఏదీ కష్టం కాదు. నేను జాతిలో ఉన్నాను, దాని పునరుత్థానంలో వున్నాను, నేను వాసుదేవుడిని, నేను నారాయణుడిని, నేనేమని సంకల్పిస్తే అదే జరుగుతుంది. ఇతరులు సంకల్పిం చింది కాదు. నేనేది సాధించాలని నిర్ణయిస్తానో, దాన్నే మానవశక్తీ ఆపలేదు."

*

హఠాత్తుగా ఏదో జరిగింది. వెంటనే నన్ను తిరిగి ఒక్కరే ఉండే జైలుగదిలో ఏకాంతం లోనికి పంపించారు. ఆ కాలంలో నా అనుభవాలను చెప్పాలనిపించడం లేదు. కాని రోజు రోజుకు, భగవం తుడు నాకు తన అద్భుతాలు చూపించాడు, హిందూ మతం యొక్క అసలు సత్యాన్ని నేను గ్రహించేట్లు చేసాడు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

హిందూమతములోని సంయోజితాంశములు

అన్వేషణలో క్రింది మెట్టుకు చెందిన మతరూపాలు, మతసిద్ధాంతాలకన్నా ఎంతో పైగా స్వతంత్రము, విశాలము అయిన వాతావరణంలో ఉన్నతోన్నతమైన ఆధ్యాత్మికత పురోగమిస్తుంది. అది మతసిద్ధాంత పరిమితులను సహించదు. వాటిని అనుమతించినప్పుడు కూడా, వాటిని అతిక్రమిస్తుంది. సాధారణమైన మతవిశ్వాసపరుని మనస్సుకు అర్థంకాని ఒక అనుభవంలో అది జీవిస్తుంది. కాని మానవుడు అంత త్వరగా ఆ మహోన్నత ఆంతరంగిక ఊర్ధ్వస్థాయిని అందుకోలేడు. ఒకవేళ వెంటనే దానిని అతని నుండి కోరిన పక్షంలో, అతడెన్నటికి ఆ స్థితిని చేరుకోలేడు. మొదట అతనికి క్రింది ఆధారాలు, ఆరోహణ సోపానాలు అవసరము. తన అంతరంగంలో దైవ మందిరాన్ని నిర్మించునప్పుడు అతడు తాను నిలబడుటకు ఆలంబనమగు సిద్ధాంతము, పూజ, ప్రతిమ, గుర్తు, రూపం, చిహ్నం, సాక్షికంగా సహజ మగు మిశ్రమభావాన్ని తన ఇష్టప్రకారం వుంచుకొనుటకై అనుమతిని కోరుతాడు. ఆలయ నిర్మాణము పూర్తి అయినప్పుడే ఆధారాలను తీసి వేయవచ్చును. ఆలంబనం అదృశ్యమౌతుంది. ఇప్పుడు హిందూమత మన్న పేరుతో కొనసాగుతున్న మతసంస్కృతి ఈ ప్రయోజనాన్ని సాధించడమేగాక, కొన్ని అచల మతాలు గ్రహించలేని, తన ప్రయోజనాన్ని గుర్తెరిగి యుండినది.

భారతీయమతము మానవజీవితం ముందు నాలుగు అవసరాలను వుంచినది. మొదట ఆది ఒక మహోన్నత చేతనపై లేదా విశ్వానికి చెందిన, విశ్వాతీతమైన ఉనికియందు విశ్వాసాన్ని మనస్సుపై విధించింది. దేని నుండి సర్వము ఉద్భవిస్తుందో, దేనిని తెలియకనే దానిలో జీవిస్తూ, చరిస్తుందో; అనంతము, సంపూర్ణము, శాశ్వతము అయిన దేనివైపు తిరిగి ఒకనాటికి దేనిని గూర్చిన ఎరుకను పొంది తీరవలెనో దానిని గూర్చిన విశ్వాసాన్ని మనస్సుపై విధించింది. ఈ మహత్తరమైన ఉనికికి సంబంధించిన సత్యము లోనికి సచేతనంగా పెరగడానికి అవసరమైన ప్రయత్నాన్ని చేపట్టుటకై మానవుడు సిద్ధమయ్యేంతవరకు, అభివృద్ధి ద్వారాను మరియు అనుభవం ద్వారాను స్వప్రయత్నావశ్యకతను వ్యక్తిగత జీవితంపై నిలి పింది. మూడవదిగా అది సుస్థిరమైన, బాగుగా పరిశోధింపబడిన, బహు శాఖలుగా విస్తరించే, సదా అభివృద్ధిచెందే జ్ఞానమార్గాన్ని, ఆధ్యాత్మిక లేక ధార్మిక క్రమశిక్షణా మార్గాన్ని దానికి

కలిగించింది. చివరగా ఈ ఉన్నత దశలను అందుకోవడానికి సంసిద్ధం కానివారికి ఒక వ్యక్తిగత మరియు సామూహిక జీవనవ్యవస్థను ఏర్పాటు చేసింది. దాని చట్రంలో వ్యక్తిగతమైన మరియు సామాజికమైన క్రమశిక్షణ, ప్రవర్తన, మానసిక, నైతిక, ప్రాణిక అభివృద్ధి వున్నది. ఆ అభివృద్ధి ద్వారా వారిలో ప్రతి ఒక్కరు తనదైన పరిమితిలో, తన స్వభావానికి అనుగుణంగా ఇంకా ఉన్నతమగు అస్తిత్వాన్ని అందుకొనుటకు తుదకు సంసిద్ధులగుటకు వీలున్నది. అది జీవితంలో ఏ భాగాన్నికాని, లౌకికమైనదని; ధార్మిక, ఆధ్యాత్మిక జీవితానికి బాహ్యదూరమైనదని కాని వదలివేయలేదు. అజ్ఞాని యగు విమర్శకుడు వ్యర్థంగా ఊహించునట్లు ఇప్పటికిని భారతీయ మతసంప్రదాయం ధార్మిక — సమాజిక విధాన రూపం మాత్రం కాదు. ఒక సాంఘిక పరివర్తన సమయంలో అది ఎంత గొప్పగా పరిగణింపబడి నను, నిశ్చయింపబడిన లేక విపరీతమైన మార్పుల నన్నింటిని సాంప్రదా యక, ధార్మిక చిత్తము ఎంత గట్టిగా ఎదిరించినను, హిందూ మతము యొక్క మూలతత్వము ఆధ్యాత్మిక విధానమే కాని సామాజిక విధానం కాదు. హిందూమతాన్ని నిర్మించే ఈ నాలుగు మూలాంశాలలోను, హిందు వులలోనే వేరువేరు విభాగముల, జాతుల, కూటముల, వర్గాల మధ్య పెద్దా చిన్న విభేదాలు న్నాయి. అయినా వాటన్నింటిలోను ఒక మౌలిక విధము, రూపము, ఆధ్యాత్మిక స్వభావముగల సర్వసామాన్య దైవిక ఏకత్వమున్నది. అది ఈ విశాల సరళతలో ఒక అపార సంధానశక్తిని, సుదృఢమైన ఏకత్వసూత్రాన్ని సృష్టిస్తున్నది.

భారతీయమత సారము

భారతీయ మతానికంతటికీ చెందిన మౌలికమైన ఆశయము ప్రతిచోట ఉన్నతోన్నతమైన మానవుల ఆలోచనకు అనుగుణంగా ఉండునదే. దాని సర్వోత్కృష్టమగు సత్యము ఒక శాశ్వతసత్త లేక మనము ఇక్కడ దర్శించు మానసిక, భౌతిక రూపాలకు అతీతమగు ఒక అస్తిత్వము మనస్సుకు, జీవితానికి, శరీరానికి ఆవల ఒక అతీత దైవశక్తి యున్నది. అది అంతముకల, అంతములేని, అన్నిటిని తనలో కలిగి యున్నది. సాపేక్షికమైన ప్రతిదానినీ అది అతిక్రమించి యున్నది. అది మహోత్కృష్టమగు పరమము. మా ర్పుకు లోనగు ప్రతిదీ దాని నుండి పుడుతున్నది. దాని మీదనే ఆధారపడి యున్నది. అది శాశ్వతమైనది. అది భావాతీతము, మూలభూతము, విశ్వాత్మకము, ఆద్యంత

రహితము, దివ్యత్వము లేక దివ్యతత్వము, చేతన, శక్తి మరియు ఆనందము. సమస్త వస్తువులకు మూలముగాను, నిలయముగాను వున్నది. ఆత్మ, ప్రకృతి, జీవితము శాశ్వతమైన, స్వయంప్రజ్ఞతో కూడిన ఆ చైతన్యపు అభివ్యక్తులు లేక పాక్షిక దృగ్విషయములు మాత్రమే. కాని భారతీయ చిత్తము ఈ అస్తిత్వ సత్యాన్ని ఒక తాత్త్విక భావనగా, ఒక మత సిద్ధాంతంగా, ప్రజ్ఞతో ఊహింపబడిన ఒక అవ్యక్త తత్త్వంగా మాత్రమే గ్రహించలేదు. ఇది ఒక ఆలోచనా పరుడు తన అధ్యయనంలో తన అభీష్టం మేరకు భావించినదియు, జీవితంలో మరే విధంగాను ఉపయోగపడనిదీ అయిన శూన్యతత్త్వమూ కాదు. ఇది మానవుడు ప్రకృతితోను, ప్రపంచంతోను తనకుగల సంబంధా లలో ఉపేక్షింపదగిన నిగూఢ అతీతతత్త్వం కాదు. మానవులందరు వారి వారి శక్తికి తగినట్లు ఈ జీవితంలోను, ఆ తరువాత వేయివిధాలుగా అభిలషించ దగిన ఒక సజీవ ఆధ్యాత్మిక సత్యము, తత్త్వము, శక్తియే ఇది. మరి అది వందల కొలది ఆకృతులను ధరించినదన్నచో అందుకు కారణం ఖచ్చితంగా దాని సజీవత్వమే. ఒక అనంతమైనది మాత్రమే అంతముగల దాని ఉనికిని నిరూపించగలదు. అంతేగాని అంతముగలది పూర్తిగా స్వతంత్రమగు ఉనికినిగాని, వేరైన ఒక విలువనుగాని కలి గియుండజాలదు. జీవితం ఒక భ్రమ కానప్పుడు, అది భగవల్లీలయే. ఆ అనంతత్త్వపు వైభవ అభివ్యక్తియే. అసంఖ్యాక రూపాలతోను, జీవితములలోను ప్రకృతిలో పెరుగు చున్న ఆత్మ ప్రేమ, జ్ఞానము, విశ్వాసం, పూజల ద్వారా దానిని సమీపించి, స్పృశించి, భావించి, సర్వకార్యాలలో ఈ అనంత అస్తిత్వంతో, ఈ సర్వాతీతశక్తితో భగవంతుని వైపుకు పయనించు ఇచ్ఛతో దానితో సమన్వయం చెందగల సాధనమే అది. ఈ ఆత్మ లేక స్వీయ అస్తిత్వ తత్త్వమే ఏకైక మహోన్నత సత్యము. తక్కినవన్నీ పైకి కనిపించు స్వరూపాలు మాత్రమే. లేదా ఆ తత్త్వంపై ఆధారపడియున్నందున నిజమైనవి. దీని వలన తెలునదేమనగా సజీవుడైన, ఆలోచనాపరుడైన మానవుని ప్రధాన కర్తవ్యము ఆత్మసాక్షాత్కారము. భగవత్ సాక్షాత్కారమును సాధించుటకు మనము పొందు పురోగతిలో మన జీవితాలు, భావనలు అన్నీ ఉపకరణాలు మాత్రమే.

భారతీయ మతము మహోన్నత సత్యానికి సంబంధించిన బౌద్ధిక లేక మతపరమైన భావనలు చాలా ముఖ్యమైనవని ఎప్పుడూ భావించలేదు. ఏ రూపంలో నైనా, ఏ భావనతోనైనా ఆ సత్యాన్ని అన్వేషించుట, అంతరంగ అనుభవంతో దానిని పొందుట, చైతన్యంతో దానితో జీవించుట అత్యవసరమైన ఏకైక కార్యంగా

అది భావించింది. ఒక శాఖ లేక ఒక వర్గము జీవాత్మ విశ్వాత్మనుండి లేదా సర్వోత్కృష్ట దైవం నుండి విడ దీయరానిదని భావించవచ్చు. మరొక శాఖ మానవుణ్ణి తత్త్వతః దైవంతో అభిన్నునిగాను, స్వరూప ప్రకృతిని బట్టి భిన్నుంగాను భావించవచ్చును. మూడవ శాఖ దైవము, ప్రకృతి, జీవాత్మ ఈ మూడూ శాశ్వతంగా విభి న్నములగు శక్తులని భావించవచ్చును. కాని పై అందరిచేత ఆత్మయొక్క సత్యతత్త్వము సమానమగు పట్టుదలతో అంగీకరింపబడినది. భారతీయ ద్వైతవాదికి కూడా భగవంతుడే పరమాత్మ. అతడే పరమ సత్యము. అతని వలననే అతనిలోనే ప్రకృతి. మానవుడు జీవిస్తున్నారు. కదులుతున్నారు. తమ ఉనికిని కలిగియున్నారు. ఈ దృష్టి నుండి భగవంతుని తొలగించినచో ప్రకృతి మరియు మానవుడు తమ విలువను ప్రయో జనాన్ని పోగొట్టుకొన్నవారే అవుతారు. పరమాత్మ, విశ్వప్రకృతి (మాయ, ప్రకృతి, శక్తి అనబడునది) జీవాత్మ అను ఈ మూడు సత్యములే భారత దేశములో పరస్పరం వివాదించుకొను అనేక మతాలు, మతసిద్ధాంతాలు అంగీకరించిన సత్యాలు. మానవుని లోని అంతరంగ ఆధ్యాత్మిక పురుషుడు — అతనిలోని దైవాత్మ, ఆ ఆంతరంగ ఆత్మ — దైవము లేక పరమోత్కృష్ట తత్త్వము లేక శాశ్వత బ్రహ్మముతో ఒక విధమగు సజీవ సమైక్య సంబంధాన్ని లేక సంపూర్ణ ఐక్యతను కలిగియుండుట ఆధ్యాత్మిక పరిపూర్ణతకు ముఖ్యనిబంధన యనుట కూడా విశ్వజనీనము. ఆ భగవత్ తత్త్వాన్ని అనంతమైన అవ్యక్త తత్త్వంగా ఊహించడం, అనుభవించడం లేక భావాతీత మైన విశ్వాత్మక ఆద్యంతరహిత పురుషుడుగా భావించి గ్రహించుట మన అభీష్టానికి వదిలివేయబడింది. కాని ఆయనను చేరు మన మార్గమేదైనా, ఆధ్యాత్మిక అనుభవం యొక్క ఏకైక ముఖ్యాంశమేమ నగా ఆయన సర్వాస్తిత్వపు హృదయంలోను, కేంద్రస్థానంలోను వున్నాడు మరియు అస్తిత్వం సర్వం ఆయనలో వున్నది. ఆయనను దర్శించుటే మహోన్నత ఆత్మసాక్షాత్కారం. భారతీయ చిత్తానికి సైద్ధాంతిక విశ్వా సాలలోని విభేదాలు అందరిలోను ఒకే దైవాన్ని సందర్శించు విభిన్నమార్గాల కన్నా వేరు కాదు. ఆత్మసాక్షాత్కారమే అత్యావశ్యకమైన కర్తవ్యము. అంతరాత్మకు అభిముఖం కావడం, అనంతంలో జీవించడం, శాశ్వత స్వరూపాన్ని అన్వేషించి కనుగొనడం, భగవంతునిలో ఐక్యం కావడం అనునదే మతంయొక్క సర్వసమ్మతమగు భావము, లక్ష్యము, సాఫ ల్యాన్ని చేకూర్చి ముక్తిని ప్రసాదించగల సత్యమదే. భారతీయ మతము యొక్క ఏకీకరణ బంధం ఈ అత్యున్నత ఆధ్యాత్మిక సత్యము

మరియు అత్యున్నత ఆధ్యాత్మిక లక్ష్యములను క్రియాత్మకంగా అనుసరించుటయే. దాని వేయిరూపాల వెనుకనున్న ఏకైక సర్వసమ్మతమగు సారమిదే

ఈ సువిశాలమైన మహత్తర ఆధ్యాత్మిక సత్యం, అతి విశాలమగు ధీరహృదయంతో చూడబడటం, భావించబడటం, అద్వితీయ తీవ్రతతో ప్రవచించబడటం, అన్ని దిశల నుండి అనుసరించబడటమే గాక అది జీవితం యొక్క పరమోన్నతకారకమైన భావనగా, తలపులన్నింటికి సారంగా, మతానికంతకూ ఆధారంగా, మానవాళి ఉనికికి పరమ లక్ష్యంగా, పరమ నిగూఢంగా నిర్ధారింపబడింది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: సముద్రాల లక్ష్మణయ్య

భారతీయ వైశ్విక దార్శనికత

మానవ స్వభావాల, బౌద్ధికవివేకాల వైవిధ్యం అపారం. అందుకే అనంతత్వం దిశగా సాగుతున్న ప్రతి వ్యక్తికి సంపూర్ణ భావస్వాతంత్ర్యాన్ని, పూజా సాంప్రదాయ స్వేచ్ఛను అనుమతించాలని భారతీయ మతం సర్వదా భావిస్తూ వచ్చింది. భారతదేశంలోని నాస్తికులు, అజ్ఞేయవాదులు ఎలాంటి మతద్వేష పరమైన చిత్రహింసకు గురి కాలేదు. బౌద్ధ జైనమతాలు అనాచార నాస్తిక మతాలుగా నిరసించబడినా, అవి తోటి సనాతన సదాచార సాంప్రదాయ తాత్త్విక మతాల సరసన నిలచి జీవించే అవకాశాన్ని కోల్పోలేదు. సత్యపిపాసియైన భారతదేశం ఆ అన్ని మతాల మనుగడకు పరిపూర్ణ అవకాశాన్ని ఇచ్చింది. వాటి తాత్త్విక విలువలను పరిశీలిస్తూ వచ్చింది. ఆయా మతాల సత్యతలను, సతతం విశాలమయ్యే తన ఆధాత్మిక అనుభవంలోనికి అధికంగా జీర్ణించుకొన్నది. అవిచ్ఛిన్నమైన ఆ అనాది అవిచ్ఛిన్నతను పదిలపరచుకుంటూనే పలు దిశల నుండి ప్రసరిస్తున్న అన్ని వివేక విజ్ఞాన ప్రకాశాలను ఆదరించింది. తదనంతర కాలంలో, హిందూ మహ్మదీయ మతబోధల మధ్య ఏకత్వాన్ని దర్శించిన కొందరిని వాళ్లు మహ్మదీయులుగా జన్మించినా మహ్మదీయ దృక్పథం నుండి ప్రారంభమైనా కూడా, భారతీయ మతాచార్యులుగా అంగీకరించింది. నవీన యోగమార్గానికి చెందిన యోగుల, కొత్త మతవ్యవస్థలను స్థాపించిన మతాచార్యుల ఆధ్యాత్మిక అస్తిత్వ బహుముఖ సత్యప్రతిపాదితములైన చింతనుల స్వీయమత

ప్రచారాలకు ఎలాంటి ప్రతిబంధకం కాలేదు. మార్పులను సహజంగా వ్యతిరేకించే పండితుల పూజారుల నుండి కొంత ప్రతికూలత తలయెత్తినా కాని స్వేచ్ఛా విన మ్రతలతో వర్ధిల్లే విశాల జాతీయ మత వ్యవస్థలో చేర్చబడిన మరో కొత్త అంశం ముందు ఆ ప్రాతికూల్యత తలవంచేది.

బహుముఖంగా నమనీయమైన భారతీయ ఆధ్యాత్మిక తాత్త్విక అనుభవంలోని ఈ సహనశీల వైశాల్యత నిజానికి దాని సత్యానికి, దాని సజీవ వాస్తవికతకు అన్వేషణ ఆవిష్కరణల యందు దానికి గల నిర్నిబద్ధ చిత్తశుద్ధికి గుర్తు. కాని ఈ నమ్యత యూరోపియనులకు సంకటంగా ఉండేది. వాళ్ళ మతచింతన కఠినమైన విధివిధానా లకు, కఠోర నిర్ణయాలకు, దయాహీన బహిష్కరణలకు, బాహిరమైన నిరంతర భౌతిక భావాలకు, కచ్చితమైన శైలీ నిర్మాణ వ్యవస్థలకు అలవాటు పడినది. పాశ్చాత్యుల మతం కఠిన స్వభావులైన తార్కిక పండితుల మతవిశ్వాసం. అనాచార విచారం గావించి స్వీయనిర్ణయాలతో నిర్దయతో బహిష్కరణలను విధించే మతగురువుల సామూహిక వ్యవస్థ. వారిది నిర్దిష్టమైన నైతిక సూత్రాల ఆధారంగా రూపొందిన దయారహితమైన కఠోర ప్రవర్తనా నియమావళి. ఇన్ని కఠినమైన కట్టుబాట్లతో ఆత్మను బంధించి భద్రపరచినప్పటికీ వాళ్లకుగల భావోద్వేగాన్ని గుహ్యాన్వేషణను కొన్ని సహేతుక పరిమితులలో సహించవచ్చు. కాని ఇటువంటి ఘాటైన మసాలా దినుసులు లేకపోవడమే బహుశా క్షేమమనుకొంటాను. ఇలాంటి భావజాలంతో తరిఫీదు పొందిన యూరపుదేశ విమర్శకుడు భారతదేశానికి వచ్చినప్పుడు అధిక సంఖ్యాకులైన బహు దేవతారాధ్యులను చూచి, వివిధ విశ్వాసాలకు శిఖరాయమానమైన ఒకే అనంతుని యందు గల నమ్మకాన్ని వారు అంగీకరించడం లోని క్లిష్టతకు ఆశ్చర్యపడిపోతాడు. ఐనా, ఇది తమ స్వంత విశ్వాసమేనని, తమ శుష్క బౌద్ధిక సమస్త దేవతారాధన లాంటిదే అని అపార్థం చేసుకుంటాడు. తన స్వీయభావ మూర్ఖ నిర్ణయాలను, న్యాయదూరమైన తమ అసత్యపు విలువలను భారతీయ తాత్త్విక చింతనల భావపరం పర లోనికి విద్యాధికుల మనస్సు లోనికి కూడా, దిగుమతి చేస్తాడు. అతని నికరమైన స్వీయ ప్రమాణాలను తప్పించుకోగలిగినా కూడా తన అసత్య అపార్థ ప్రకటనల ద్వారా అహంకారపూరితంగా నిందారోపణ చేస్తాడు. ఇందుకు భారతీయ మేధ పూర్తిగా విముఖం. ఒక గొప్ప అంతఃస్ఫూర్తి, ఒక ఆంతరిక అనుభవశక్తి మనకు విశ్వచైతన్యాన్ని వైశ్విక దార్శనికతను ప్రసాదించింది. ఈ అనాది విభవం దరిదాపులకు

ఇప్పుడిప్పుడే పాశ్చాత్య మేధ తడబడుతూ జేరే ప్రయత్నం చేస్తున్నది భారతీయ మేధస్సు అవిభాజ్యమైన ఏకత్వాన్ని దర్శించుకుంటూనే ఆత్మప్రకృతుల ద్వంద్వ త్వాన్ని అంగీకరిస్తుంది. త్రైక్యాలనే కాక లక్షలాది ఇతర తత్వాల అస్తిత్వాలకు ఆస్కారం కల్పిస్తుంది. సీమితమైన ఏకైక దైవత్వ భావంపై ఏకాగ్రత చూపుతూనే తన నిజ సహజాతమైన చైతన్యం వెనుక నానాత్వాన్ని గురించిన స్పృహ, ఏకైకపు భావన కలిగి ఉంటుంది. వివిధ వస్తుతతిపై భక్తిభావాన్ని పరుస్తూనే తానారాధించే వాటి ద్వారా వీక్షిస్తూ, బహు అధిష్టాన దేవతలలో పరాత్పరుని ఏకత్వాన్ని దర్శిస్తుంది. ఈ సంయోగాత్మక మలుపు వేదాల మీద వేదాంతం మీద వర్ధిల్లే రహస్యవేదులకు, తత్వచింతనులకు లేదా అల్ప సంఖ్యాకులైన అక్షరాస్యులకు మాత్రమే పరిమితమైనది కాదు. అది సామాన్యుల జనరంజక భావాల మీద, వాటి ప్రతిరూపాల మీద, పురాణాల మీద, తంత్రశాస్త్రాల మీద, సాంస్కృతిక సంకేతాల మీద, సాంప్రదాయాల మీద ప్రసరించి విస్తరిస్తుంది. ఎందుచేతనంటే ఇవి కేవలం పవిత్ర వేదాలకు సంబంధించిన సంయోగాత్మక అద్వైతవాదం యొక్క ఘనిష్ట వ్యక్తీకరణలు, లేక సజీవ రూపాలు. బహు పార్శ్వముల ఏకతావాదం, సువిశాల జగత్తుకు సంబంధించిన సార్వత్రికవాదన కనుక.

హిందూమతం కాలాతీత నామరూపరహిత పరాత్పరుడు కలడనే అవగాహనపై ప్రతిష్ఠింపబడింది. అది ఏ ఇతర అజ్ఞానమయమైన సంకుచితమైన కేవల ఏక దేవతా విశ్వాసంగల శైశవజాతి మతాల వలె నిత్యుడు, అనంతుడు వరకూ గల నామరూప శక్తులు గల వ్యక్తిత్వాలను నిరాకరించలేదు, నిషేధించలేదు. అది కళావిహీనమైన ఏకత్వవాదం కాదు. విశ్వాతీత అస్తిత్వవాదం దాని ప్రారంభ, మాధ్యమిక, అంతిమ దశ కాదు. ఏకైక భగవత్తత్వం 'సర్వం' గా పూజించబడింది. ఎందుకనంటే జగత్తులో నున్నదంతా ఆతడే, లేదా ఆతని అస్తిత్వం నుండే తయారైంది, లేదా ఆతని స్వభావం నుండే తయారైంది. అలా అని, భారతీయ మతం బహు దేవతావాదం కాదు. ఎందుకనంటే ఈ సార్వజనీనత కావల అతీతుడైన నిత్యుని అది కనుగొన్నది. ప్రాచీన యూరపులో ప్రాచుర్యం పొందిన బహుదేవతావాదం లాంటిది గాదు భారతీయ బహుదేవతా వాదం. ఎందుకనంటే ఇచట అతని సమస్త దైవతాలు ఆ ఏకైకుని రూపాలు, నామాలు, మూర్తిత్వాలు అని బహుదేవతల నారాధించినప్పటికీ అతనికి తెలుసు. ఇచట బహుదేవతారాధకునకు అందరు దేవుళ్ళు ఒకే ఒక పూర్ణపురుషుని

వివిధ రూపాలు, వివిధ నామాలు, వివిధ వ్యక్తిత్వాలు, వివిధ శక్తులని తెలుసు. అతని అందరు దేవతలు ఒకే ఒక్క దైవక్రియాశక్తి యొక్క ఊర్జాలని తెలుసు. భగవదస్తిత్వ వాదులైన హిందూమతస్తుల విధానాలు, ప్రాచుర్యం పొందిన ఆస్తిక వాదాన్ని పోలి వున్నప్పటికీ, అవి వాటిని మించి ఇంకా ఎంతో ఉన్నతమైనవి. అందుకే వారు భగవంతుని బహుపార్శ్వాలను అంగీకరిస్తారు. హిందువుల విగ్రహారాధన కేవలం ప్రతిమాస్వరూపాలకు పరిమితమైన అనాగరిక భావం కాదు. హిందూమతంలోని ఎంతటి మూర్ఖునకైనా తెలిసిన విషయం — విగ్రహం ఒక సంకేతం. అవసరం తీరినాక విడువ వీలున్న ఒక ప్రతీక. నానక్ చిర ప్రార్థనా విధానమైన 'అకాల' ఏకైకుడు లాంటి ఇస్లామిక్ ప్రభావిత అర్వాచీన మతాలు, పాశ్చాత్య ప్రభావానికి లోనైన నాటి సంస్కరణవాద మతాలు ఇప్పుడు పాశ్చాత్య మత సంకుచితత్వం నుండి దూరమౌతున్నవి. వారి ఆదిమ ఏకత్వ అస్తిత్వ భావజాలం నుండి, ఆ పాశ్చాత్య ప్రాగ్జాతుల మతధార నుండి జారుకుంటున్నవి. వాళ్లందరూ ఈ శైశవ అవగాహనలను దాటి అగాధ సదృశమైన వేదాంతం కేసి మొగ్గు చూపుతున్నారు. అత్యంత సక్రియ, సత్యస్వరూపంగా దేవుని మూర్తిత్వాన్ని, ఆతని మానవ సంబంధాలను వైష్ణవ, శైవ మతాలు గట్టిగా ప్రతిపాదించినవి. ఈ మతాల మొత్తం సారం ఇది మాత్రమే కాదు, ఈ భగవద్వ్యక్తిత్వం అన్నది పాశ్చాత్యులు పరిమితీకరించి భూతద్దంలో చూపే మానవ వ్యక్తిగత దేవుడు కాదు. భారతీయ మతాన్ని నిర్వచించడానికి ఏ పాశ్చాత్య పరిజ్ఞానం పనికి రాదు.

మొత్తంపైఅది అన్ని అధ్యాత్మారాధనల అనుభవాల ఉదాత్త సమ్మేళనం. ఒకే సత్యాన్ని పలు పార్శ్వాల నుండి దర్శించడం, దేన్నీ నిషేధించకపోవడం విశేషం. ఇది ఏ ఒక్క పేరుతో ప్రత్యేకించబడదు. పరిమితీకరించు విశేషణానికీ బద్ధం కాదు. వివిధ మతశాఖలకు సముచిత ఉదాత్త సంజ్ఞాత్మక అభిదానాలను ప్రదానం చేస్తూనే, తాను మాత్రం నామరూపరహితంగా, విశ్వవ్యాపియై, అనంతమైనదిగా నిలచింది. అనాదిగా అన్వేషిస్తున్న బ్రహ్మపదార్థంలాగా హిందూమతం కొనసాగుతున్నది.

ప్రతి మతం మానవాళికి సహాయకారిగా నిలిచింది. ఇతరమైన ప్రతి మతతత్వం మానవునిలో సౌందర్య తేజాన్ని, జీవన ఔన్నత్యాన్ని, వైశాల్యాన్ని, వైవిధ్యమైన పరిపూర్ణ మహోద్దేశాన్ని పెంచింది. క్రైస్తవ మతం దివ్యప్రేమను, దాతృత్వాన్ని ఇచ్చింది. బౌద్ధమతం వివేకాన్ని, సాధుత్వాన్ని, పవిత్రతను పొందే వివేకమార్గాన్ని

సూచించింది. ఇస్లాం యూదుమతాలు క్రియాశీలమైన మతవిశ్వాసాన్ని, దృఢమైన భగవద్భక్తిని అందించాయి. హైందవమతం సువిశాలమైన, అగాధ సదృశమైన గంభీర ఆధ్యాత్మిక అనంత అవకాశాలను ప్రసాదించింది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: ఎస్. రామస్వామి

హిందూమతంలోని మూడు మూలసూత్రాలు

"హిందూమతం అంటే ఏమి? అది ఏమి బోధిస్తుంది? దాని అనుష్ఠానం ఎలాంటిది? అందులోని సాధారణ సూత్రాలేవి?" అని ఎవరైనా మనలను ప్రశ్నిస్తే అందుకు మనం హిందూతమం మూడు మూలభావాల మీద లేక అత్యున్నతము, సువిశాలము అయిన ఆధ్యాత్మిక అనుభవానికి చెందిన మూడు ప్రాథమిక అంశాల మీద ఆధారపడిన దని సమాధానం చెప్పవచ్చు. మొదట వచ్చునది ఋషులు వివిధ నామములతో పేర్కొను వేదమందలి ఏకైక అస్తిత్వ భావము. ఉపనిషత్తులు తెలుపు అద్వితీయ ఏకైక తత్త్వము. అది అభివ్యక్తమైయున్న ఈ సర్వము, ఆ సర్వానికి అతీతము. బౌద్ధుల శాశ్వత్ తత్త్వము, మాయావాదుల పరమము, ఆస్తికుల భావనలో ఆత్మను, ప్రకృతిని తన అధీనమందుంచుకొను పరమోత్కృష్ట దైవము లేక పురుషుడు. ఒక్క మాటలో చెప్పవలెనన్న శాశ్వత అనంత తత్త్వము. అదియే మొదట సాధారణ ఆధారము. కాని మానవమేధ దానిని అనంత విధాలైన సూత్రాలలో ప్రకటించగలదు, ప్రకటిస్తున్నది. శాశ్వతము, అనంతము, సనాతనము అయిన ఈ తత్త్వాన్ని కనుగొని, దానిని అతి సన్నిహితంగా సమీపించి, అందులో ఎలాంటి మార్గంలేక ప్రమాణంలోనైనా ఐక్యం కావడమే ఆధ్యాత్మిక అనుభవానికి పరాకాష్ఠ. భారతీయ ధార్మికచింతనలో అదే మొదటి విశ్వజనీన విశ్వాసము.

ఈ ఆధారాన్ని ఏ సూత్రం ద్వారానైనా అంగీకరించు. భారతదేశములో గుర్తించబడిన సహస్రాధిక మార్గాలలో ఏ ఒక్క మార్గంలోనైనా లేక వాటినుండి విస్త రించు ఏ నూతన మార్గంలోనైనా ఈ గొప్ప ఆధ్యాత్మిక లక్ష్యాన్ని అనుసరించు — అప్పుడు నీవు ఆ మతము యొక్క హృదయాన్ని చేరినట్లే. ఎందుకనగా దాని రెండవ మూలభావము శాశ్వతమూ, అనంతమూ అయిన ఆ తత్త్వాన్ని చేరుటకు

మానవుని బహువిధాత్మక మార్గము. ఈ అనంతం అనేక అనంతాల కలయిక. ఆ అనంతాలలో ప్రతి ఒక్కటీ ఆ శాశ్వతత్త్వమే. ఈ విశ్వానికి చెందిన పరిమితులలో భగవంతుడు తన్ను అనేక మార్గాలలో వ్యక్తీకరించుకొంటాడు. ప్రపంచంలో పరిపూర్ణుడై భాసిస్తాడు. అందులో ప్రతిమార్గము సనాతన తత్త్వానికి చెందిన మార్గమే. ఎందుకనగా ప్రతి నిర్దేశకతలోను అనంతాన్ని కనుగొనవచ్చును. ఆ దేవుని అన్ని రూపాలలోను, సంకేతాలలోను మనం అనంతాన్ని చేరవచ్చును. విశ్వశక్తులన్నీ దాని వ్యక్తీకరణలే. శక్తులన్నీ ఆ ఒక్క తత్త్వానికి చెందినవే. ప్రకృతి కార్యాల వెనుకనున్న దేవతలు ఏకైక దైవతత్త్వము యొక్క శక్తులు, పేర్లు, వ్యక్తీకరణలుగా గ్రహించి ఆరాధింపదగి వున్నాయి. మనకు మంచివిగానో లేక చెడ్డవిగానో, అంగీకరింపదగినవిగానో లేక తగనివిగానో, అదృష్టకరములుగానో లేక దురదృష్ట కరములుగానో తోచు సకల సంఘటనల వెనుక ఒక అనంత చైతన్యశక్తి, కార్యనిర్వాహకశక్తి, ఇచ్ఛ లేక ధర్మం, మాయ, ప్రకృతి, శక్తి లేక కర్మ అనునది వున్నది. ఆ అనంతత్త్వమే సృష్టికార్యంలో బ్రహ్మగా, పోషణలో విష్ణువుగా, సంహారం లేక తనలో విలీనం చేసుకొనుటలో రుద్రుడు లేక శివుడుగా భాసిస్తాడు. సృష్టికి ఆధారంగా, రక్షణగా క్షేమాన్ని కలిగించు ఆ మహోన్నత శక్తి వున్నది లేక అది లోకమాతయగు లక్ష్మి లేక దుర్గగా రూపొందు తున్నది. సంహారమను ముసుగులో వుండి కూడా ప్రయోజనకారిగా వుండునది శ్యామలమాతయగు చండి లేక కాళి. ఆ ఏకైక దైవం తన గుణాల కనుగుణంగా వివిధ నామాలతో, వివిధ దేవతలుగా అభివ్యక్తమగుచున్నాడు. వైష్ణవుల దివ్యప్రేమ నిధానదైవం, శాక్తేయులల దివ్యశక్తి నిధానమైన దైవం రెండు విభిన్న దైవాలుగా కనిపిస్తారు. కాని నిజానికి వారు విభిన్న రూపాలలో[1] నుండు ఏకైక అనంతత్త్వమే. జ్ఞానంతోగాని, అజ్ఞానంతోగాని ఒకడు ఈ వివిధ నామాలు, ఆకృతులలో దేని ద్వారా నైనా పరతత్త్వాన్ని చేరవచ్చును. ఎందుకనగా వాటి ద్వారానే, వాటికావల కడకు పరమ అధ్యాత్మిక అనుభవం వైపు పయనించవచ్చును.

అయితే ఇక్కడ మనం ఒక్క విషయం గమనించాలి. చాలామంది ఆధునిక భారతీయ మతప్రబోధకులు ఆధునిక భౌతిక హేతువాదాలతో బౌద్ధికమగు రాజీ

[1] *పాశ్చాత్య కువిమర్శలను త్రిప్పికొట్టడానికి, భారతీయ బహుదేవతా వాదాని కిచ్చిన ఈ వివరణ ఆధునిక సృజన కాదు. గీత యందు ఇది సవివరంగా చెప్పబడింది. దానికంటె ఇంకా చాలా ముందటి ఉపనిషత్తుల అర్థం కూడా ఇదే. పురాతనకాల ఆరంభం నాటి 'ఆదిమ' వేదకవుల (నిజానికి వారు గంభీర మార్మికవాదులు) చే అనేక వాక్కులలో స్పష్టంగా చెప్పబడింది.*

మార్గంలో వీటిని కేవలం సంకేతాలుగా వివరించడానికి ప్రయత్నించగా, ప్రాచీన భారతీయ మనస్తత్వం వాటిని సంకేతాలుగా మాత్రమేగాక ప్రాపంచిక సత్యాలుగా, మాయాప్రపంచానికి చెందిన ప్రాతి భాసిక సత్యాలుగా దర్శించింది. ఎందుకనగా ఊహాతీత సమున్నతమగు ఉనికికి, భౌతికస్థితికి మధ్య భారతీయ ఆధ్యాత్మిక, చైత్యవిజ్ఞానం సంబంధం లేని విరుద్ధాంశాల మధ్యలాగ ఈ రెండింటి మధ్య ఒక అగాధాన్ని సృష్టించ లేదు. చేతనకు, అనుభవానికి చెందిన ఇతర మానసికతలాలు గూడా దానికి తెలుసు. ఈ అతిభౌతిక తలాలకు చెందిన సత్యాలు, భౌతికప్రపంచానికి చెందిన బాహ్యసత్యాల కంటే దాని దృష్టిలో తక్కువ యథార్థాలు కావు. మానవుడు మొదట తన మానసిక ప్రకృతికీ, లోతగు అనుభవశక్తికీ, స్వభావానికీ, అధికారానికీ తగిన రీతిలో భగవంతుణ్ణి సమీపిస్తాడు. అతుడు చేరుకోగలిగిన సత్యతలము, చైతన్యతలము అతని ఆంతరంగిక పరిణామ దశచేత నిర్ణయింపబడుతున్నది. అటు తరువాత మతసంప్రదాయానికి చెందిన వైవిధ్యం వస్తుంది. అయితే దానికి సంబంధించిన వివరాలు కేవలం ఊహాజనితాలు కావు. కవుల, పురోహితుల కల్పనలు కావు. అవి భౌతిక ప్రపంచానికి చెందిన చేతనకూ, పరతత్త్వానికి చెందిన వర్ణనాతీత అతిచేతనకూ మధ్యవున్న అతిభౌతిక అస్తిత్వానికి చెందిన సత్యాలు. భారతీయమత ఆధారంలో వున్న దృఢతమ పర్యవసానం ఆంతరంగిక ఆధ్యాత్మిక జీవితానికి అత్యంత క్రియాశీలమైనది. ఒక విశ్వజనీనచైతన్యం ద్వారా మరియు అంతర బాహ్య ప్రకృతిని చొచ్చుకొనిపోవుట ద్వారా పరతత్త్వం లేక దైవాన్ని చేరవచ్చును. ప్రతి జీవాత్మ తనలోను, తన ఆధ్యాత్మిక భాగంలోను ఆ పరతత్త్వం లేక దైవాన్ని కలియవచ్చును. ఎందుకనగా అందులో ఏదో ఉన్నది. అది సన్నిహితంగా ఒకటి లేక కనీసం ఒక దైవాస్తిత్వంతో సన్నిహిత సంబంధాన్ని కలిగినది. భారతీయ మతంయొక్క సారాంశం మనం ఆ విధంగా పెరుగుటకు, మరియు జీవించుటకు, మన మనోజీవితాలను కప్పియుండు అజ్ఞానం నుండి బయటపడి మనలోని దివ్యత్వాన్ని గూర్చిన ఎరుకను పొందుటకు ఉద్దేశించుటయే. ఈ మూడు అంశాల ఏకీకరణమే హిందూమతం యొక్క సర్వస్వం, దాని ఆవశ్యకమగు భావము. ఏదైనా విశ్వాసం అవసరమైనచో, అది దాని విశ్వాసమే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: సముద్రాల లక్ష్మణయ్య

ఈ జాతి కొక పిలుపు

ప్రపంచం కళ్ళ ముందు అందరూ స్పష్టంగా చూడగల ప్రక్రియతో, ఎంతో వేగంగా ఒక జాతి నిర్మాణం జరుగుతోంది. సానుభూతి కలవారూ అంతఃస్ఫూర్తి కలవారూ, ఏ శక్తులు ఈ కార్యాన్ని నిర్వహిస్తున్నాయో, ఏ ద్రవ్యాలు ఇందులో ఉపయోగించబడు తున్నాయో, ఏ దివ్యనిర్మాణశైలి ననుసరించి ఆ నిర్మాణం జరుగుతున్నదో గుర్తింపగలుగుతారు. ప్రకృతి కర్మాగారం నుండి అప్పుడే క్రొత్తగా తయారైన, లేదా ఆధునిక పరిస్థితులచే సృజించబడిన అసంస్కృత జాతి కాదు యిది. ఈ భూమిపై నున్న పురాతన జాతులలో అత్యంత పురాతనమైన ఒక జాతి యిది. మహోన్నత నాగరికతలలో ఒకటి. తలవంచని శౌర్యం, విశాల మహనీయత, ప్రగాఢ జీవనం, అద్భుతమైన అంతర్నిహితశక్తిగల జాతి యిది. వ్యాపనశక్తి గల విదేశీ ప్రవృత్తి ప్రభావం నుండి, ఇతర విధాలైన మానవ నాగరికత నుండి, తదితర అసంఖ్యాక వనరుల నుండి శక్తిని స్వీకరించి ఇప్పుడు వ్యవస్థీకరించబడిన జాతీయైక్యత లోనికి తనను తాను శాశ్వతంగా ఉద్ధరించుకొనాలని కాంక్షిస్తున్నది. ఒకే జీవన విధానం ఒకే సంస్కృతి కలిగినదై దాయాది జాతుల సమాహారంగా గతంలో భారతదేశం వున్నది. అత్యంతావశ్యకతగల, ఏకత, ఐకమత్యం వైపు సదా మొగ్గుచూపే ధర్మంతో అది జీవించింది. ఎప్పుడూ నూతన వైవిధ్యాలు, విభజనలకు తావిచ్చేంత అత్యుదార విశాల స్వభావం యీ జాతిది. అటువంటి జాతిగల దేశాన్ని వ్యవస్థీకరించడంలో అధిగమించలేనట్లు కన్పించే ఆటంకాలు అనేకం ఉంటాయి. వాటినది యిప్పటి వరకు ఏనాడూ శాశ్వతంగా జయించలేక పోయింది. వాటి నధిగమించు సమయ మిప్పు డాసన్నమైంది. మన జాతికి గల సుదీర్ఘ చరిత్రలో, అది ఏ ప్రయత్నం చేస్తూ వచ్చిందో, దానిని ఇప్పుడు ఈ నూతన పరిస్థితులలో తప్పక విజయవంతంగా సాధిస్తుందని నమ్ముతున్నాం. ఎందుకనంటే స్వేచ్ఛాభారతం, గొప్పదైన భారతం ప్రపంచాని కవసరం... భగవంతుడు మనతోనే ఉన్నాడని విశ్వసిస్తున్నాం. ఆ విశ్వాసంతో మనం తప్పక జయిస్తాం. మానవజాతికి మన అవసరం వున్నదని మనం నమ్ముతున్నాం. మానవాళి, మన దేశం, మన జాతి, మన మతం యెడల గల మన ప్రేమ, మన సేవ ఈ సంఘర్షణలో మన హృదయాన్ని పునీతం చేసి, మన కర్మకు ప్రేరణను కలిగిస్తాయని మనం విశ్వసిస్తున్నాం.

మనం నిర్వహించ నిర్దేశించుకొన్న మహాకార్యం యాంత్రికమైనది కాదు. అది నైతికమైనది, ఆధ్యాత్మికమైనది. మన లక్ష్యం ఒక నూతన జాతి నిర్మాణమేగాని, ఒక ప్రభుత్వ రూపాన్ని మార్చడం గాదు. ఆ కార్యనిర్వహణలో రాజకీయాలు ఒక అంశం, కేవలం ఒక అంశం మాత్రమే. కేవలం రాజకీయాలకో, సాంఘిక సమస్యలకో, లేక వాటి కోసమే వాటిననే దృష్టితో ఒక ధార్మిక సిద్ధాంతానికో, లేదా తాత్త్విక సిద్ధాంతానికో, లేదా సాహిత్యానికో, లేదా విజ్ఞానశాస్త్రానికో మనల్ని మనం అంకితం చేసుకొనకుండా, అన్నింటి కంటే అత్యంత ముఖ్యమైన విషయమని మనం విశ్వసించే, ఏకైకంలో, ధర్మంలో, సార్వజనీనమైనదని కూడా భావించే జాతీయమతంలో, వీటన్నింటినీ సమన్వయం చేసుకోవాలి. ఒక ప్రబలమైన జీవనధర్మం ఉంది. మానవ పరిణామానికి సంబంధించిన ఒక గొప్ప సూత్రం ఉంది. ఆధ్యాత్మిక జ్ఞానం, ఆధ్యాత్మిక అనుభవాలు గల ఒక పటిష్ట వ్యవస్థ వుంది. దానిని సంరక్షించే బాధ్యత భారతదేశం తన మీద వేసుకోవాలని, ఆ వ్యవస్థ కదొక ఉదాహరణగా నిలవాలని, దానిని అది సర్వవ్యాపకం చేయాలని విధి నిర్దేశించింది. ఇది సనాతన ధర్మం, ధర్మం యొక్క నిర్మాణం పైనే గాక దాని సజీవ సత్యంపై పట్టును, విదేశీ ఆటుపోట్ల వత్తిడి క్రింద అధికంగా కోల్పోయాం. ఎందుకనంటే ఆ సత్యాన్ని జీవించకపోతే భారతీయ మతం ఉనికిని కోల్పోతుంది. దాన్ని జీవితానికి మాత్రమే అనువర్తింప జేయడం గాదు, జీవితానికి సంబంధించిన సమస్తానికీ దాన్ని అనువర్తింపజేయాలి. దాని సారం మన సమాజంలోనికి ప్రవేశించి, దాని రూపాన్ని, మన రాజకీయాలను, మన సాహిత్యాన్ని మన విజ్ఞానశాస్త్రాన్నీ మన వ్యక్తిగత సహజ లక్షణాన్నీ, అభిమానాలను, ఆకాంక్షలనూ నూతన రూపంలో తీర్చిదిద్దాలి.

ఈ ధర్మం యొక్క హృదయాన్ని అర్థం చేసుకొనడం ఒక పరమ సత్యంగా దాన్నర్థం చేసుకొనడం, అది ఏ ఉన్నత భావోద్వేగాల లోనికి ఎగయగలదో, వాటిని సంవేదించడం, వాటిని జీవితంలో వ్యక్తపరచి ఆచరించడాన్నే కర్మయోగంగా మనం అర్థం చేసుకోవాలి. యోగం మానవ జీవితాదర్శం కావాలి. అలా చేయడానికే ఈ రోజు భారతదేశ పునరుద్ధరణ జరుగుతున్నదని మనం విశ్వసిస్తున్నాం. తన స్వేచ్ఛను, ఐకమత్యాన్ని, గొప్పతనాన్ని వాస్తవం చేసుకొనడానికి అది యోగం ద్వారా శక్తిని పొందుతుంది. యోగం ద్వారానే వాటినది నిలబెట్టుకొనే శక్తిని కూడా పొందుతుందని మనం విశ్వసిస్తున్నాం.

మన దూరదృష్టికి ఒక ఆధ్యాత్మిక విప్లవం కన్పిస్తోంది, భౌతిక విప్లవం కేవలం దాని యొక్క ఛాయ, అసంకల్పిత ప్రతిక్రియ మాత్రమే. యంత్రాల ద్వారా గొప్పగా సంపదను కూడబెట్టడం ఐరోపీయుడు తన లక్ష్యంగా పెట్టుకొంటాడు. మానవజాతిని సామాజిక పథకాల ద్వారా, ప్రభుత్వ విధానాల ద్వారా పునరుద్ధరించాలని కాంక్షిస్తాడు. పార్లమెంటులో చేసే చట్టాల ద్వారా అతడు సుపరిపాలన తీసుకురావాలని ఆశిస్తాడు. యంత్రాలకు గొప్ప ప్రాముఖ్యత వుంది. కాని అవి మనిషి లోపలి ప్రతిభ, మనిషి వెనుక నున్న అసలు శక్తి పనిచేయడాని కుపయోగపడే సాధనాలు మాత్రమే. పంధొమ్మిదవ శతాబ్ద భారతదేశం, రాజకీయ, పరాధీనత నుండి విమోచన కోసం, సాంఘిక పునరుజ్జీవనం కోసం ఆకాంక్షించింది. కాని అది విఫలమైంది. ఎందుకనంటే అది అప్పుడు పశ్చిమ దేశాల ఉద్దేశ్యాలను, విధానాలను అవలంబించింది. ఆత్మశక్తిని, గతచరిత్రను, మన జాతి భవిష్యత్తును విస్మరించింది. యూరపు విద్యా విధానాన్నీ, యూరపు యంత్రాలనూ, యూరపు పాలనా వ్యవస్థనూ, వస్తువాహనాలనూ స్వీకరించి, మనం, ఇక్కడే, మనలో యూరపు సిరిసంపదలనూ, శక్తినీ, అభివృద్ధినీ సాధించాలని యత్నించింది. ఇరవయ్యో శతాబ్దిలో వున్న మనం, ఆ లక్ష్యాలను, ఆదర్శాలను ఆంగ్లీకరించబడిన పద్ధతులను ఖచ్చితంగా తిరస్కరించాలి. ఎందుకనంటే వాటి అనుభవాన్ని మనం యిప్పటికే పొందాం. వర్తమానాన్నొక ఆరాధనీయ శిలాప్రతిమలా చేయడాని కంగీకరించగూడదు. మన దృష్టిని భూత, భవిష్యత్తుల వైపు సారించాలి. మన వెనుక నున్న మన జాతి యొక్క ఘనచరిత్రను చూడాలి. ఆ చరిత్ర ఏ మహాద్భుత భవిష్యత్తుకై మనలను సిద్ధం చేసిందో దాని కోసం, ఆ భవిష్యత్తు లోనికి మన దృష్టి సారించాలి.

అగ్రగామిగా నిలబడి, యూరపు పరిష్కరించలేక విఫలమైన, రాజకీయ, సాంఘిక, ఆర్థిక, నైతిక సమస్యలను పరిష్కరించడానికి భారతదేశం తనకే స్వంతమైన ఒక స్వతంత్ర జీవన విధానాన్ని, నాగరికతను రూపొందించుకోవాలి. యూరపు ఆ సమస్యలను పరిష్కరించలేక పోయినప్పటికీ, వారి పరిష్కార సాధనలో, ఒక ప్రయోగం నుండి మరో ప్రయోగానికీ, ఒక ఓటమి నుండి మరో ఓటమికి దారితీసిన ఉద్రిక్తభరిత పయనాన్ని అది తన అభివృద్ధిగా చెప్పుకొంటోంది. మనం సాధించే చరమ లక్ష్యం ఎంత గొప్పదో, దాన్ని సాధించడాని కుపయోగించే సాధనోపాయాలు కూడా అంత గొప్పవై ఉండాలి. మనలోనే ఆ ప్రచండ బలానికి సంబంధించిన శాశ్వత మూలం

కోసం అన్వేషించడం ద్వారా మాత్రమే కనుగొనబడినదైతేనే అది చరమ లక్ష్యం అవుతుంది. కేవలం యంత్రాలను మార్చి, యూరపును అనుకరించే సమాజంగా మన సమాజాన్ని తయారుచేస్తూ, సాంఘిక పునర్నిర్మాణం సాధించగలమని మనం భావించలేం. విధవావివాహాలు, కులం స్థానంలో వర్గాన్ని పెట్టడం, వివిధ కులాల సహపంక్తి భోజనాలు, సంఘసంస్కర్తకు సంబంధించిన అలాంటి చిట్కాలు కేవలం భౌతికమైన మార్పులు మాత్రమే. వాటి మేళ్ళు, కీళ్లు ఏవైనప్పటికీ అవి స్వతహాగా జాతి అంతరాత్మను రక్షించలేవు, లేదా జాతిభ్రష్టతను, జాతిపతనాన్ని అరికట్టలేవు. ఆత్మశక్తి మాత్రమే జాతిని రక్షించగలదు. హృదయంలో గొప్పగా, స్వేచ్ఛగా తయారుగావడం ద్వారానే మనం సాంఘికంగా, రాజకీయంగా గొప్పవారం, స్వేచ్ఛాజీవులం కాగలుగుతాం. పశ్చిమదేశాల నుండి దిగుమతి చేసుకొన్న, పరిమితమూ, సంకుచితమూ అయినటువంటి, హీన మతభావాలతో నూతన తెగలను పెంచుకుంటూ పోవడం ద్వారా, హిందూత్వపు విలువలను బాహ్యాకృతిని మాత్రమే కలకాలం నిలబెట్టుకోవడానికి సంస్థలను సృజించుకొంటూ పోవడం ద్వారా, మన ఆధ్యాత్మిక ఆరోగ్యాన్నీ, శక్తినీ, గొప్పతనాన్నీ సాధించగలమని మనం విశ్వసించలేం.

కాబట్టి మానవాళి కోసం, భారతదేశ పునర్నిర్మాణంలో సాయం చేయడం, మన లక్ష్యం కావాలి — మనం ప్రవచిస్తున్న, అనుసరిస్తున్న జాతీయత యొక్క ఆత్మ యిది. "మానవాళి ఏ ఉన్నత, ప్రగాఢ, విస్తృతతర జీవనం వైపు కదులుతున్నదో అందులోనికి నీవు ఒక గొప్ప అడుగు వేయడానికి సమయం ఆసన్నమైంది.అంతరంగంలోనూ, బాహ్యజీవితంలోనూ మనిషి యొక్క స్వేచ్ఛను సుస్థిరం చేసుకొనడం ద్వారా, బాహ్యప్రకృతిని అంతరంగం నుండి జయించడం ద్వారా, మానవాళిని యిబ్బంది పెడుతున్న సమస్యలు పరిష్కారమౌతాయి గాని, సౌఖ్యాలకు, విలాసాలకు దాస్యం చేయడానికి ప్రకృతి శక్తులను అధీనంచేసుకొనడం ద్వారా కాదు. ఆ కార్యం నిమిత్తమే, ఆసియా పునరుత్థానం ఆవశ్యకమౌతుంది. అందుకోసమే అది పునరుత్థానమౌతున్నది" అని మానవాళికి చెప్తాం.

"యూరపు లాగా కాకుండా మనం మనంగా ఉండడం భగవంతుని సంకల్పం. మన ధర్మాన్ని గాక పరధర్మాన్ననుసరిస్తూ మనం జీవితాన్ని తిరిగి సాధించాలను కొన్నాం. మనం వెనుదిరిగి మనలోనే ఉన్న జీవనమూలాలను, శక్తిని శోధించి కనుగొనాలి. మనం మన గతాన్ని తెలుసుకోవాలి. మన భవిష్యత్తు కోసం దాన్ని తిరిగి

సాధించుకోవాలి. మొదట మనల్ని మనం తెలుసుకోవాలి. భారతదేశపు సనాతన జీవన విధానానికి సంబంధించిన స్వభావం యొక్క ధర్మానికనుగుణంగా సమస్తాన్నీ రూపొందించుకోవాలి" అని కూడా మనం మానవాళికి చెప్తాం.

అంతరంగ సామ్రాజ్యాన్ని జయించడం ద్వారా, మేధోపరమైన, ఆత్మగతమైన శక్తులను వశం చేసుకొనడం ద్వారా, బాహ్యప్రకృతిని, అంతరంగంలో నుండి జయించడం ద్వారా మానవాళిని యిబ్బంది పెడ్తున్న సమస్యలు పరిష్కారమౌతాయి గాని, సౌఖ్యాలకు, విలాసాలకు దాస్యం చేయడానికి ప్రకృతి శక్తులను అధీనం చేసుకొనడం ద్వారా గాదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

తగిన నివారణోపాయం

భారతదేశం తన స్వరూపంలో తాను నిలబడి తన ప్రకృతి కనుగుణమైన విధానాన్ని అనుసరించడం ద్వారానే తన అభివృద్ధిని చక్కగా సాధించి ఇతర మానవాళికి కూడా సేవ చేయగలదు. కొంతమంది సంకుచితంగా, గ్రుడ్డిగా భావించునట్లు కాలప్రవాహంలో మనకు సంప్రాప్తించు క్రొత్తదైన ప్రతిదానినీ, లేక పాశ్చాత్యదేశాలలో ప్రథమంగా, సమర్థంగా వ్యక్తం చేయబడి మనకు సంప్రాప్తమైన ప్రతిదానినీ తిరస్కరించడం కాదిది. అట్టి అభిప్రాయం బౌద్ధికంగా అసంగతం, భౌతికంగా అసాధ్యం మరియు అన్నింటిని మించి, ఆధ్యాత్మికతకు విరుద్ధం. నిజమైన ఆధ్యాత్మికత క్రొత్త వెలుగును తిరస్కరించదు. మానవుల ఆత్మోన్నతికి అవసరమగు వస్తువులను, పరికరాలను కాదనదు. మన కేంద్రంలో మన ముండి, మన ఉనికిని, మన సహజ ప్రకృతిని రక్షించుకొంటూ, వెలుపలి నుండి మనం పొందే ప్రతిదానిని దానితో సమన్వయించుకొని మనం చేయు, సృష్టించు సర్వాన్ని దాని నుండి ఉద్భవం చేసుకొనుటయే దాని అర్థము. భారతీయ హృదయ కేంద్రబిందువు సనాతన ధర్మమే. అతిగా అనుసరింప బడిన ఈ ధర్మంవల్లే భారతదేశం నాశనమైనదని కొందరు చెప్పారు. ఎందుకంటే మనం జీవితాన్నంతా మతమయం చేశాము. లేదా మతాన్ని పూర్తి జీవితంగా మార్చాము. అందువల్ల జీవితంలో అపజయంపాలై పతనమయ్యా

మని వారి అభిప్రాయం. స్వల్పంగా వేరైన మరొక సందర్భంలో ఒక కవి ఉపయోగించిన భాషను అనుసరిస్తూ, మన పతనమొక ముఖ్యవిషయం కాదని, భారతావని దేనిలో విశ్రమిస్తున్నదో ఆ ధూళి పరమ పవిత్రమని నేను చెప్పను. ఆ పతనము, ఆ వైఫల్యం గమనింప దగినవి. మరియు ధూళిలో పడివుండుట మానవునికిగాని, జాతికిగాని దృఢమగు స్థితి కాదు. అయితే అందుకు ఇవ్వబడిన కారణం మాత్రం నిజమైనది కాదు. నిజానికి భారతీయులలో అత్యధిక సంఖ్యాకులు వారి సమగ్ర జీవితాలను అక్షరతః ధర్మబద్ధం చేసివుంటే, మనం ఈనాడు ఈ దశలో వుండేవారం కాదు. ఈ పతనానికి కారణం వారి బాహ్యజీవితం పూర్తిగా మతవిరుద్ధమై, అహంకారమయమై, స్వార్థపూరితమై, భౌతికపరం కావడమే. ఒక ప్రక్క మనం మోతాదుకు మించిన మతాచారణములో పడ్డాము. అనగా కర్మకాండయొక్క ఎక్కువ బాహ్యప్రకటనకు, నియమితాచరణకు, యాంత్రికమైన పూజలకు ప్రాముఖ్యం ఇచ్చాము. మరొకవైపు అధికంగా ప్రపంచాన్ని తిరస్కరించే సన్న్యాసజీవితానికి ప్రాధాన్యమిచ్చాము. ఆ జీవితం ఆధ్యాత్మిక అవలంబనంగా, కాంతిమయంగా ప్రసాదించేవారుగా నిలిచిన ప్రాచీన ఋషులవలెగాక, ఆధునిక మేధావులను సమజానికి ఉపయోగపడనీకుండా దూరం చేసింది. దానికి మూల కారణం ఏమనగా, తన సార్వజనీనతలోను, విశాలత్వంలోను, ఆధ్యాత్మికప్రేరణ క్షీణించుట... మేధాసంపన్న మైన కార్యాచరణ, స్వేచ్ఛ దిగజారుట, ఉదాత్తములగు ఆశయాలు మృగ్యమగుట, జీవనప్రభంజనం నష్టమగుటయే.

బహుశః ఒక భావనలో మతం అత్యధికంగా వుండినది. 'రెలిజియన్' అను ఆంగ్లపదం తెగలు, ఆచారకాండ, బాహ్యపవిత్రత మున్నగు బాహ్య ములైన వాటిని చుంబిస్తుంది. దానికి సరియైన పదం భారతీయ భాషలలో లేదు. అయితే ఆ పదానికి ఆధ్యాత్మిక ప్రేరణను సంపూర్ణంగా అనుసరించుట అను భావాన్ని చేర్చి, ఆధ్యాత్మికత అనగా ఉన్నతోన్నతమగు ఆత్మను, దైవాన్ని, సర్వాన్ని కలుపుకొను ఏకత్వాన్ని తెలుసుకొని దానిలో జీవించు ప్రయత్నము, మరియు జీవితాన్ని అన్ని భాగాలతో సాధ్యమైనన్ని దివ్యతమ విలువలతో సమున్నతం గావించుట అని నిర్వచించినచో, అప్పుడు మతం అత్యధికంగా వుండలేదని, బహుస్వల్పంగా మాత్రమే వుండినదని, ఆ వుండినదానిలో, చాలవరకు ఏకపక్షమైనదగుటచే, తగినంతగా లేనప్పటికి, ఎక్కువైన వైఖరి మాత్రం వుండినదని విశదమవుతున్నది. ఇందుకు సరి

యైన నివారణ సనాతన భారతీయ ఆదర్శాన్ని ఇంకా చిన్నచూపు చూడకుండా, ప్రాచీన సమగ్రతవైపు మరల్చి, విశాలమైన పరిధిని కల్పించి, జాతి జీవితమంతా ఈ సమున్నత ఆధ్యాత్మిక భావనతో కూడిన మతమని బుజువు చేయడమే. పాశ్చాత్య దేశాలకు చెందిన తత్త్వశాస్త్రము, కవిత్వము, కళ ఇంచుమించుగా, కొంత అస్పష్టంగానైనా, ఎక్కువగుచున్న ప్రకాశంతో దారి మరల్చుటకు ప్రారంభిస్తు న్నాయి. అస్పష్టమైన సత్యానికి చెందిన కొన్ని మెరుపులు కూడా రాజకీయ, సాంఘిక ఆదర్శాల మీద ఇప్పుడు పడుటకు ప్రారంభిస్తున్నాయి. ఈ జ్ఞానానికి, ఆదర్శాన్ని సచేతనంగా ప్రయోగించుటకు కావలసిన తాళంచెవి భారతదేశం వద్ద వున్నది. దాన్ని ప్రయోగించడంలో అంతకు ముందు అంధకారమయంగా వుండిన పరిస్థితిని కొంగ్రొత్త వెలుగుతో ఇప్పుడు ఆమె ప్రకాశింప జేయగలదు. ప్రాచీన పద్ధతులలో దొరలిన దోషాలను, వంకరలను ఇప్పుడు సరిచేసుకోగలదు. ఆధ్యాత్మిక ఆదర్శం యొక్క బాహ్యాభివృద్ధిని రక్షించుటకై భారతదేశం సృష్టించిన కంచెలు, తరువాత దాని వ్యాప్తికి, అనంతర ఆచరణకు ఆటంకాలుగా పరిణమించాయి. ఇప్పుడా ఆటంకాలను ఛేదించి భారతమాత తన ఆత్మకు స్వేచ్ఛా క్షేత్రాన్ని, విశాల విజృంభణను కలిగించవచ్చును. ఆమె అనుకొంటే నేటి మానవాళి ఎదుర్కొం టున్న సమస్త సమస్యలకు ఒక క్రొత్త నిశ్చయా త్మక పరిష్కారం ఇవ్వగలదు. ఎందుకనగా వాటి పరిష్కారాలకు సంబంధించిన కీలకం ఆమె ప్రాచీన విజ్ఞానంలో వున్నది. ఆమెకు సంప్రాప్తమౌతున్న పునరుజ్జీవనంలో లభించు అవకాశ సమున్నత స్థితికి ఆమె ఉద్గమించగలదో లేదో అన్నది ఆమె భవితవ్యానికి చెందిన ప్రశ్న.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: సముద్రాల లక్ష్మణయ్య

(భారతదేశ ప్రతి పౌరునికీ)

నీ చిన్ని అహంకారిక వ్యక్తిత్వాన్ని మించి ఎదిగి మన భరతమాత కర్హమైన బిడ్డగా తయారుగావాలి. నిజాయితీతో ముక్కుకు సూటిగా నీ విధులను నిర్వహించు. దైవకటాక్ష మందు సుస్థిరమైన నమ్మకంతో సదా ఉల్లాసంగా, ధైర్యంగా ఉండు.

ఫిబ్రవరి 3, 1963

భారతదేశ కర్తవ్యం

స్వేచ్ఛ, సమత, సౌభ్రాతృత్వాల యధార్థ మూలం వైపు మానవాళిని నడిపించడమే భారతదేశ కర్తవ్యం. మనిషి తనకు తాను స్వేచ్ఛాత్ముడై వుంటే ఇతరమైన స్వేచ్ఛ అతని అదుపాజ్ఞల్లో వుంటుంది. సర్వేశ్వరుడే స్వేచ్ఛ, అతడు బంధరహితుడు. భ్రాంతి నుండి మనిషి ముక్తుడైనప్పుడు ప్రేమ, న్యాయం ద్వారా తనను సఫలం చేసుకోగల ప్రపంచపు దివ్యసమతను అతడు దర్శిస్తాడు. ఈ సమత తనంతదా ప్రభుత్వ పాలనాధర్మం లోనికి, సాంఘిక ధర్మం లోనికి మారిపోతుంది. ఈ దివ్యసమ తను అతడు దర్శించినపుడు, అతడు ప్రపంచ మంతటికీ సోదరుడౌతాడు. అతనికే అధికార స్థానమప్పగించినా, ప్రేమ, న్యాయం, ధర్మం ఆధారంగా ప్రజలందరినీ తన తోడబుట్టినవారిగా సేవిస్తాడు. ఈ దర్శనం మతానికి, తాత్త్విక చింతనకు, సాంఘికచింతనకు, రాజకీయ ఆకాంక్షకు పునాదియైనట్లయితే, అపుడు స్వేచ్ఛ, సమత, సౌభాతృత్వం, సంఘనిర్మాణంలో తమకు యుక్తమైన స్థానాన్నాక్రమిస్తాయి. సత్యయుగం తిరిగి వస్తుంది. ప్రజాస్వామ్యాన్ని గురించిన ఆసియా ప్రజల భావన ఇదే.

అంతరంగంలో స్వేచ్ఛామయుడై యుండడం, బాహ్యవత్తిడి వల్ల గాక ప్రేమతో సేవ జెయ్యడం, ప్రతి మనిషి ధర్మం. తత్త్వతః సమతను కలిగి యుండి ఇతరులకు ప్రీతి కలిగించు స్వార్థపరతను బట్టి గాక సంఘాన్ని సేవించడంలో అతనికి గల సామర్థ్యాన్ని బట్టి తన కర్హమైన స్థానాన్ని అతడు తెలుసుకోవాలి. తన సహోదరులైన మనుష్యులతో సామరస్యపూర్వక సంబంధాలను కలిగి వుండాలి. దాస్యశృంఖలాలతో గాకుండా దోచుకొనబడువాడు, దోచుకొనువాని మధ్య ఉండే సంబంధాలతో గాక, తినువాడు, తినబడుదానికి మధ్య వుండే సంబంధాలతో గాక పరస్పర ప్రేమ, సేవాభావాల బాంధవ్యం ఉండాలి. ప్రజాస్వామ్యం, మానవహక్కుల నాధారం చేసు కొని వుంటుందన్నారు. దానికి ప్రత్యుత్తరంగా అది మనిషి నిర్వహించవలసిన విధుల మీద ఆధారపడాలని అన్నారు. కాని హక్కులు, విధులు, రెండూ కూడా యూరపుకు సంబంధించిన భావాలే. కాని భారతీయ దర్శనమైన ధర్మంలో, స్వార్థాన్ని కర్మకు మూలంగా చేసే ప్రపంచ దృష్టిచే హక్కులు, విధులకు మధ్య సృజించబడిన కృత్రిమ వ్యతిరేకత సమసిపోతుంది. అంతేగాక వాటి మధ్య నుండే ప్రగాఢమైన,

శాశ్వతమైన ఐక్యతను అవి తిరిగి పొందుతాయి. ధర్మం, ప్రజాస్వామ్యానికి పట్టుగొమ్మ

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. వి. రావు

దివ్యజనని సందేశాలు

ఓ భారతమా! నీవు వెలుగు, ఆధ్యాత్మికజ్ఞాన సంపన్నురాలివి. ప్రపంచంలో నీ విద్యుక్త ధర్మాన్ని నిర్వహించడానికి మేలుకో, ఐకమత్యానికీ, సామరస్యతకు దారి చూపించి మమ్ము నడిపించు.

సెప్టెంబరు 23, 1967

ఆధునిక మానవజాతికి సంబంధించిన ఒక ఉన్నతమైన, యధార్థతను జీవితంలోనికి పునరుద్ధరించే దేశం అవుతుంది.

(భారతదేశ ప్రధానమంత్రికి)

ఉజ్వల భవిష్యత్తుకై భారతదేశం కృషి చేయాలి. ఆ భవిష్యత్తుకది ఉదాహరణగా నిలవాలి. ఆ విధంగా ఆమె తయారైతేనే ప్రపంచంలో తన యధార్థ స్థానాన్ని కైవసం చేసుకోగలుగుతుంది.

విభజన, వైరుధ్యాలను కల్పించి పాలించడం అనేది అనాది నుండి ఉన్న అలవాటు.

ఐకమత్యం, పరస్పర అవగాహన, సహకారంతో పాలించు సమయం ఆసన్నమైంది.

ఒక వ్యక్తి ఏ పార్టీకి చెందినవాడు అని చూడకుండా, ఆ వ్యక్తికున్న విలువకు ప్రాధాన్యత నిచ్చి ఆతనిని తనకు సహకారిగా తీసుకోవాలి.

ఒకే పార్టీ విజయం మీద గాక, పార్టీ లన్నింటి ఐకమత్యం మీద ఒక దేశపు గొప్పతనం ఆధారపడి వుంటుంది.

అక్టోబరు 6, 1969

అనువాదం; కె. వి. రావు